## బిజెపిని ఒంటరి చేసి, ఓడించాలి

- దేశం ముందున్న ప్రధాన కర్తవ్యం ఇదే!
- ఈ లక్ష్య సాధనకు లౌకిక, ప్రతిపక్ష పార్టీలతో కలసి కృషి
- సిపిఎం కేంద్ర కమిటీ పునరుద్ఘాటన

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 268 | విజయవాడ, సోమవారం 1 మే 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 1 May 2023 | Rs




## నేడు మేడే

కార్మికవర్గ దీక్షా దినం

అణచివేత, దోపిడిలపై
పోరాటాన్ని కొనసాగిస్తామని
కార్మికవర్గం
ప్రతిన బూనే రోజు
ఎర్రజెండా సందేశం..
సమరనాదమై
పోరుగీతమౌతుంది!

ప్రత్యేక వ్యాసం 3లో..




నూతన సచివాలయం ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్

# 'అంబేద్కర్' స్ఫూర్తితో పురోభివృద్ధి

- తెలంగాణ సచివాలయం ప్రారంభోత్సవంలో కెసిఆర్
- కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ఫైల్‌పై తొలి సంతకం

**ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో**

రాజ్యాంగ నిర్మాత, మహనీయుడు బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో తెలంగాణ పురోభివృద్ధి చెందుతుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు అన్నారు. 28 ఎకరాల్లో ఆరు అంతస్తుల్లో నూతనంగా నిర్మించిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం భవన సముదాయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆరో అంతస్తులోని తన కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సిఎం ఆసనంలో కూర్చొన్నారు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న 5,544 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసేందుకు ఉద్దేశించిన ఫైల్‌పై తొలి సంతకం చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కెసిఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులు కూడా తమ, తమ కార్యాలయాల్లో ఆశీనులయ్యారు.

అనంతరం జరిగిన సభలో కెసిఆర్ మాట్లాడుతూ ఎన్నో అవాంతరాలు, అడ్డంకులు అధిగమించి తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సాధిస్తోందన్నారు. ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ఇది సాధ్యమైందని తెలిపారు. తెలంగాణ పునర్నిర్మాణమని తానంటే... కొంతమంది మరుగుజ్జులు వెకిలిమాటలు మాట్లాడారని, అభివృద్ధి ఫలాలే వారికి సమాధానమని అన్నారు. ఎండాకాలంలో కూడా మత్తలు దుంకే చెరువులు, కాళేశ్వరం ప్రాజెక్టు, 24 గంటల కరెంటు, మిషన్ భగీరథ వంటివి పునర్నిర్మాణానికి భాష్యమని తెలిపారు. మహనీయుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపర్చిన ఆర్టికల్ 3 వల్లే తెలంగాణ రాష్ట్రం సాకారమైందని, ఆయన ఆలోచనల మేరకే రాష్ట్రంలో పాలన సాగుతోందని, మున్ముందు అదే స్ఫూర్తి కొనసాగిస్తామని అన్నారు. సచివాలయ నిర్మాణంలో పాలుపంచుకున్న అధికారులు, ఇంజనీర్లు, రేయింబవళ్లు శ్రమించిన కార్మికులకు సిఎం అభినందనలు తెలిపారు.

## సేవా నిరతి గొప్పది

- మన్ కీ బాత్ నూరవ ఎపిసోడ్‌లో ప్రధాని మోడీ
- విశాఖ వాసి పేరు ప్రస్తావన

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**



దేశ ప్రజల సేవానిరతి గొప్పది అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ఇతరుల్లో ఉన్న మంచి లక్షణాలను ఆరాధించడమే 'మన్ కీ బాత్' ఉద్దేశమని చెప్పారు. 2014 అక్టోబరు 3న ప్రారంభమైన నెలవారీ కార్యక్రమం ఈ ఆదివారంతో వందవ ఎపిసోడ్ పూర్తి చేసుకున్న సందర్భంగా తనకు ప్రజల నుంచి వేలాది ఉత్తరాలు, లక్షలాది సందేశాలు వచ్చాయన్నారు. సాధ్యమైనన్ని ఉత్తరాలను చదివి, సందేశాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించానని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ఈ ఉత్తరాలను చదివేటపుడు ఎంతో భావోద్వేగానికి గురయ్యానని అన్నారు. 'మన్ కీ బాత్' కోట్లాది భారతీయుల మనసులో మాట, వారి మనోభావాల వ్యక్తీకరణ అని అన్నారు. మునుపటి ఎపిసోడ్లలో తాను ప్రస్తావించిన అంశాలతో ప్రభావితమైన వ్యక్తులతో ఆయన నేరుగా సంభాషించారు. ఈ సందర్భంగా విశాఖపట్నానికి చెందిన వెంకటేశ్ ప్రసాద్‌ను ప్రధాని గుర్తు చేసుకున్నారు. ప్రసాద్ దేశీయ వస్తువులను మాత్రమే వినియోగించేలా చార్టును రూపొందించి, స్వదేశీ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. గత కాలపు స్మృతులకు, భావోద్వేగాలకు, సూక్తి ముక్తావళికి ఈ వందవ ఎపిసోడ్‌ను వేదికగా ఆయన మార్చారు. మనం అమృత కాలంలో ఉన్నామని, ఈ ఏడాది జి-20 సదస్సుకు అధ్యక్షత వహిస్తున్నామని చెప్పారు. స్వదేశీ ఆట బొమ్మల పరిశ్రమల పునరుద్ధరణ వంటి ఉద్యమాలు వేగం పుంజుకోవడానికి ఈ కార్యక్రమం దోహదపడిందన్నారు. స్వదేశీ జాతి కుక్కల పట్ల చైతన్యానికి ఈ కార్యక్రమం నాంది పలికిందన్నారు. ఇంటింటా జాతీయ జెండా కార్యక్రమం ప్రారంభమైనపుడు కూడా మన్ కీ బాత్ గొప్ప పాత్ర పోషించిందని గుర్తు చేశారు.

# అకాల వర్షం.. అపార నష్టం

**పలు జిల్లాల్లో తడిచిన ధాన్యం, మిర్చి, మొక్కజొన్న • కన్నీటి పర్యంతమవుతున్న రైతులు**



విజయవాడ రూరల్‌లోని ఆరు లైన్ల బైపాస్ రోడ్డుపై తడిసిన ధాన్యాన్ని ఆర పెడుతున్న రైతులు

**ప్రజాశక్తి- యంత్రాంగం**

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆదివారం కురిసిన అకాల వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. కళ్లాల్లో ఉంచిన ధాన్యం, మిరప, మొక్కజొన్న తడిచిపోవడంతో రైతులు కన్నీటిపర్యంతం అయ్యారు. ఈదురు గాలుల వల్ల మామిడి, అరటి తోటలకు నష్టం వాటిల్లింది. కళ్లాల్లో ఆరబెట్టిన, అమ్మకానికి సిద్ధం ఉంచిన పంటలను కాపాడుకోవడానికి రైతులు తీవ్ర అవస్థలు పడాల్సి వచ్చింది. వర్షంతో పాటు పిడుగులు కూడా పడడంతో ఇద్దరు మృతి చెందారు. 44 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. పల్నాడు జిల్లా క్రోసూరు, అచ్చంపేట, అమరావతి, పెదకూరపాడు మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు వీచాయి. వర్షాలకు వరి, మిర్చి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. పల్నాడు జిల్లాలో ఈదురుగాలులు వీచాయి. గుంటూరు జిల్లాలో జల్లులు పడ్డాయి. ప్రకాశం జిల్లా పొదిలి, కొనకనమిట్ల మండలాల్లో భారీ వర్షం, ఈదురు గాలులకు పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బాపట్ల జిల్లా నిజాంపట్నంలో వర్షం కురవడంతో టార్పాలిన్లు కప్పి కళ్లాలోని వేరుశనగ, మొక్కజొన్నను కాపాడుకొనే ప్రయత్నం రైతులు చేశారు. పంగులూరులో శనివారం కురిసిన వర్షానికి మొక్కజొన్న రైతులు కొంత వాటిల్లిగా, ఆదివారం కూడా మేఘావృతం కావడంతో రైతులు ఆందోళన చెందారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలో భారీ వర్షం కురిసింది. వన్‌టౌన్, పటమట, సత్యనారాయణ పురం, గవర్నరుపేట ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీరు ప్రవహించింది. నందిగామ, కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో స్వల్పంగా వర్షం కురిసింది. కృష్ణా జిల్లా గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, గుడివాడ, నందివాడ, పెనమలూరు, కంకిపాడు మండలాల్లో భారీ వర్షం పడింది. ధాన్యం రాశులు తడిచిపోయాయి. ఏలూరు జిల్లా ముదినేపల్లి, నూజివీడు, చింతలపూడి తదితర ప్రాంతాల్లో ఈదురుగాలులతో భారీ వర్షం కురవడంతో మామిడి, అరటి, మొక్కజొన్న తదితర పంటలకు నష్టం వాటిల్లింది. కళ్లాల్లో ఉంచిన మొక్కజొన్నను కాపాడుకునేందుకు రైతులు పరుగులు తీశారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఆకాశం మేఘావృతమైంది. అక్కడక్కడా చిరుజల్లులు పడ్డాయి.

### పల్నాడు జిల్లాలో పిడుగుపాటుకు రేషన్ సరఫరాదారుడు మృతి

పల్నాడు జిల్లా క్రోసూరు మండలం బయ్యవరం గ్రామానికి చెందిన రేషన్ సరఫరాదారుడు కడియం వెంకట్రావు (38) పిడుగుపాటుతో మృతి చెందారు గ్రామంలోని మర్రిచెట్టుపై పడిగుపడింది. ఈ చెట్టుకింద ఉన్న నలుగురు స్పృహతప్పి పడిపోయారు. వెంకట్రావు మిగతా 2లో

## 2 రోజులు అప్రమత్తంగా ఉండాలి


- విపత్తుల నిర్వహణ సంస్థ సూచన

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ఐఎండి అంచనా ప్రకారం తూర్పు విదర్భ నుంచి ఉత్తర తమిళనాడు వరకు తెలంగాణ, కర్ణాటక మీదుగా ద్రోణి కొనసాగుతోందని విపత్తుల సంస్థ ఎండి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వెల్లడించారు. ద్రోణి ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో పిడుగులతో కూడి, అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు ఆయన తెలిపారు. మే 1న కోనసీమ, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్ఆర్, శ్రీసత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు పడే అవకాశముంది. మే 2న పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణ, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్ఆర్, శ్రీసత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశముందని తెలిపారు. రెండు రోజులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు, కూలీలు, గొర్రెల కాపరులు బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. భారీ వృక్షాల కింద ఎవరూ ఉండరాదని పేర్కొంది.

# బిజెపిని గద్దె దించుదాం

- ప్రచారభేరి సభల్లో సిపిఎం, సిపిఐ నేతల పిలుపు
- రాష్ట్రానికి అన్యాయం చేసిన మోడీకి వైసిపి, టిడిపి, జనసేన భజన
- మూడు ముక్కలాటలో జనం బలి కారాదు : వి శ్రీనివాసరావు



ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**ప్రజాశక్తి- యంత్రాంగం**

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపిని ఓడించడం ద్వారా ప్రధాని మోడీని గద్దెదింపి దేశాన్ని కాపాడుకుందామని సిపిఎం, సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు. బిజెపితో కలిసే పార్టీలకు పతనం తప్పదని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన రాజకీయ ప్రచారభేరిలో భాగంగా ఆదివారం పలు జిల్లాల్లో ప్రదర్శనలు, బహిరంగ సభలు జరిగాయి. ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో జరిగిన బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రత్యేక, హోదా విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి బిజెపి తీరని ద్రోహం చేసిందన్నారు. అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతోందని, మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టాలని చూస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి అన్ని రకాలుగా అన్యాయం చేసిన కేంద్రంపై జగన్, చంద్రబాబు, పవన్ కల్యాణ్ పోరాడాల్సిపోయి మోడీని ప్రసన్నం చేసుకోవాలని చూస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో అధికారం కోసం మోడీతో కలిసి వైసిపి, టిడిపి, జనసేన ఆడుతున్న మూడుముక్కలాటలో జనం బలికావొద్దని కోరారు. మోడీ పాలన బ్రహ్మాండంగా ఉందని చంద్రబాబు పొగడడం శోచనీయమన్నారు. మోడీని పొగిడేటప్పుడు ప్రజలపై భారాలు వేయడం, ప్రజలను కులాలు, మతాల పేరుతో చీలుస్తుండడం గుర్తుకురాలేదా? అని చంద్రబాబును శ్రీనివాసరావు ప్రశ్నించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక భారత రాజ్యాంగాన్ని పక్కనబెట్టి మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేస్తోందని దుయ్యబట్టారు. గ్యాస్, పెట్రోలు, నిత్యావసర ధరలు భారీగా పెరిగాయన్నారు. సభకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కె.మాబు, సిపిఐ సంతనూతలపాడు నియోజకవర్గ కార్యదర్శి ఎస్.మురళీ అధ్యక్షత వహించారు. సిపిఎం రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య, జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, సిపిఐ మిగతా 2లో

## గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్

- ముగ్గురు మావోయిస్టులు మృతి

**గడ్చిరోలి :** మహారాష్ట్రలోని గడ్చిరోలిలో ఆదివారం సాయంత్రం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మరణించినట్లు పోలీసులు తెలిపారు. వారిపై రూ.38 లక్షల రివార్డు ఉందని చెప్పారు. అహేరి తహసీల్ పరిధిలోని మన్నే రాజారాం గ్రామంలో సాయంత్రం ఆరు గంటల సమయంలో ఎన్‌కౌంటర్ జరిగినట్లు గడ్చిరోలి డిఐజి సందీప్ పాటిల్ తెలిపారు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కెద్మెరా అటవీ ప్రాంతంలోని మనే రాజారాం, పెరిమిలి ఆర్మ్‌డ్ అవుట్ పోస్టుల మధ్య పెరిమిలి, అహేరి దళాలు సంచరిస్తున్నాయని సమాచారం రావడంతో రెండు సి-60 దళాలు గాలింపు చర్యలు చేపట్టాయని తెలిపారు. మావోయిస్టులు కాల్పులు జరపడంతో, ఎదురు కాల్పులు జరపగా, ముగ్గురు మరణించారని చెప్పారు. వారిలో పెరిమిలి దళ కమాండర్ బిట్లు మాదవి, అదే దళానికి చెందిన వాసు, అహేరి దళానికి చెందిన శ్రీకాంత్ ఉన్నట్లు గుర్తించామని తెలిపారు.



సిఐడి కార్యాలయం వద్ద వాసు భార్య, ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి భవాని

## ఆదిరెడ్డి అప్పారావు, వాసు అరెస్టు

- సిబిఐ రీజినల్ కార్యాలయంలో విచారణ
- వైద్యపరీక్షల అనంతరం మెజిస్ట్రేట్ ముందు హాజరు



ఆదిరెడ్డి అప్పారావు



ఆదిరెడ్డి వాసు

**ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి, అమరావతి బ్యూరో**

మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావును, ఆయన కుమారుడు, ఎంఎల్‌ఎ భవాని భర్త ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు)ను వారి నివాసంలో సిబిసిఐడి పోలీసులు ఆదివారం ఉదయం 6.30 గంటలకు అరెస్టు చేశారు. లాలాచెరువు సమీపంలోని సిబిసిఐడి రీజినల్ కార్యాలయానికి తరలించి విచారణ చేశారు. వారిపై సెక్షన్ 420, 409, 120 బి, 477 ఎ కింద కేసులు నమోదు చేశారు. రాత్రి 10.30 గంటల సమయంలో వైద్య పరీక్షల నిమిత్తం రాజమహేంద్రవరంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం రాత్రి 11.30 గంటల సమయంలో తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.సునీత ఇంటికి తీసుకెళ్లి ఆమె ఎదుట హాజరు పర్చారు. అర్ధరాత్రి 12.30 గంటలకు కూడా మిగతా 2లో

# పంజాబ్‌లో దారుణం

- లూధియానాలో విష వాయువు లీక్
- 11 మంది మృతి.. వీరిలో ముగ్గురు మహిళలు.. ఇద్దరు బాలికలు
- మరో నలుగురి పరిస్థితి విషమం



**చండీగఢ్ :** పంజాబ్‌లో ఘోరం చోటు చేసుకున్నది. లూధియానాలో గ్యాస్ లీకైన ఘటనలో 11 మంది మరణించారు. వీరిలో ముగ్గురు మహిళలు..మరో ఇద్దరు బాలికలు ఉన్నారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నది. వెంటనే ఆ మొత్తం ప్రాంతాన్ని పోలీసులు సీల్ చేశారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. గియాస్‌పురలోని ఈస్ట్‌మన్ చౌక్ వద్ద గల సువా రోడ్‌లో ఆదివారం ఉదయం విషవాయువు లీకవడంతో 11 మంది అక్కడికక్కడే మరణించారు. నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో, ఆస్పత్రిలో చికిత్సను అందిస్తున్నారు. మురికి కాల్వల మేన్‌హోల్స్ నుంచి గ్యాస్ లీకయిందని తొలుత అధికారులు భావించినా, ఆ తర్వాత అది కాదని వెల్లడైంది. ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు తమవద్ద గల ఎయిర్‌క్వాలిటీ సెన్సార్లతో పరీక్షించగా, గాల్లో హైడ్రోజన్ సల్ఫైడ్ గ్యాస్ స్థాయి ఎక్కువగా వున్నట్లు తేలింది. బహుశా ఈ ప్రమాదానికి ఇది కారణమై వుండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాలను సివిల్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై లుధియానా పోలీసులు సెక్షన్ 304 కింద గుర్తు తెలియని వ్యక్తులపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఘటనపై దర్యాప్తు జరుపుతున్నట్టు వెల్లడించారు.

ఈ ఘటనపై పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. ప్రమాద ప్రాంతానికి పోలీసులు, జిల్లా యంత్రాంగం, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు తరలాయనీ, సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయని ట్వీట్ చేశారు. ఈసంఘటనపై దర్యాప్తు జరిగిన తర్వాతనే అసలు కారణం తెలుస్తుందని లూధియానా వెస్ట్ ఎస్‌డిఎం స్వాతి తెలిపారు. ప్రమాదంలో మరణించినవారికి రూ.2లక్షలు, గాయపడిన వారికి రూ.50వేలు సాయం అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

లుధియానాలోని డొరాహా పట్టణంలో ఇలాంటి గ్యాస్ లీక్ ఘటనే 2015 జూన్‌లో చోటు చేసుకున్నది. అమ్మోనియా గ్యాస్ లీక్ కావడంతో, ఆ ఘటనలో ఐదుగురు చనిపోయారు. దాదాపు వంద మంది అనారోగ్యానికి గురయ్యారు.

# 26 నుంచి దేశవ్యాప్త ఆందోళన

- సెప్టెంబరు నుంచి నవంబర్ వరకు అఖిల భారత జాతాలు
- ఎస్‌కెఎం జాతీయ సమావేశం నిర్ణయం




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌కెఎం నాయకులు

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

దేశంలో రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై దేశవ్యాప్త ఆందోళనకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) పిలుపునిచ్చింది. ఆదివారం నాడిక్కడ హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో నిర్వహించిన సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ సమావేశానికి వివిధ రైతు సంఘాల నుంచి 200 మందికి పైగా రైతు నాయకులు హాజరయ్యారు. వివరణాత్మక చర్చల తరువాత, జాతీయ సమావేశం భవిష్యత్తు కార్యక్రమాలను నిర్ణయించింది. అనంతరం ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా (పిసిఐ)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌కెఎం నేతలు అశోక్ దావలే, హన్నన్ మొల్లా, దర్శన్ పాల్, అవిక్ షా సమావేశం నిర్ణయాలను వెల్లడించారు. "కనీస మద్దతు ధర చట్టం, రుణ మాఫీ, రైతు, వ్యవసాయ కార్మికుల పెన్షన్, సమగ్ర పంటల బీమా పథకం, లఖింపూర్ ఖేరీ హత్యలకు బాధ్యుడైన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా అరెస్ట్, రైతులపై తప్పుడు కేసుల ఉపసంహరణ, ఉద్యమంలో అమరులైన రైతుల కుటుంబాలకు పరిహారం వంటి ప్రధాన సమస్యలపై మే 26 నుండి 31వరకు అన్ని రాష్ట్రాల్లో నిరసనలు, ఆందోళనలు జరగనున్నాయి. ఇందులో భాగంగా పార్లమెంటు సభ్యులు, ముఖ్య రాజకీయ నాయకుల సొంత నియోజకవర్గాల్లో కార్యాలయాలు, నివాసాల వద్దకు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించి, మెమోరాండం సమర్పిస్తాం' అని తెలిపారు. మే, జూన్, జులై నెలల్లో అన్ని రాష్ట్రాల్లోనూ రైతులు, వ్యవసాయ కార్మికులతో రాష్ట్ర, జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహిస్తామన్నారు. "రైతుల, కార్మికులకు ఎంతో సేవలందిస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను, ఆస్తులను కార్పొరేట్‌లకు విక్రయించడాన్ని నిరసిస్తూ ఆగస్టు 1 నుండి 15 వరకు కార్మిక సంఘాలు, ఇతర సంఘాల సమన్వయంతో సామూహిక నిరసనలు నిర్వహిస్తాం" అని తెలిపారు.

"సెప్టెంబరు నుండి నవంబర్ మధ్య దేశవ్యాప్తంగా భారీ అఖిల భారత జాతాలు నిర్వహిస్తాం. వాటికి ఎస్‌కెఎం జాతీయ నాయకులు నాయకత్వం వహిస్తారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ మొదలైన అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాలపై జాతాలు ప్రత్యేకంగా దృష్టి సారిస్తాయి" అని పేర్కొన్నారు. లఖింపూర్ ఖేరీలో బిజెపి నాయకులు రైతులను హత్య చేసిన అక్టోబర్ 3న, అఖిల భారత షహీదీ దివస్ నిర్వహిస్తామని తెలిపారు. "నవంబర్ 26న రైతుల చారిత్రాత్మక ఢిల్లీ చలో మార్చ్ ఢిల్లీ మిగతా 2లో

## ఉపాధ్యాయ బదిలీల జివోలు వెనక్కి

- ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఉపాధ్యాయుల బదిలీల కోసం విడుదల చేసిన జివో 187, 190లను రాష్ట్రప్రభుత్వం వెనక్కు తీసుకుంది. ఈ రెండు జివోలను ఉపసంహరించుకుంటున్నట్లు పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ శనివారం జివో 39 విడుదల చేశారు. విభిన్న అంశాలతో కొత్త ఉత్తర్వులు విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఈ జివోకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం ప్రాంతీయ, జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదివారం ఉత్తర్వులు విడుదల చేశారు.

## న్యాయం కోసం వారం రోజులుగా వీధుల్లో....

- రెజ్లర్లకు ఎస్‌కెఎం మద్దతు
- ప్రధాని మోడీ రెజ్లర్ల మన్ కీ బాత్ వినాలి: వినేష్ ఫోగట్

లోపలి పేజీలో..

## కృష్ణపట్నం మూడో యూనిట్‌కు 'మహానది' బొగ్గు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కృష్ణపట్నంలోని శ్రీ దామోదర సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ (ఎస్‌డిఎస్‌టిపిఎస్)కు బొగ్గు సరఫరా చేసేందుకు మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్(ఎంసిఎల్) అంగీకరించినట్లు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. రెండోదశ కింద 800 మెగావాట్ల సామర్ధ్యంతో ప్రారంభించిన మూడో యూనిట్‌కు ఏడాదికి 35.48 లక్షల టన్నుల బొగ్గును సరఫరా చేసేందుకు ఒప్పందం జరిగినట్లు వెల్లడించారు. ఈ నెల 1 నుంచి అదానీ కృష్ణపట్నం పోర్టు ద్వారా బొగ్గు సరఫరా ప్రారంభమవుతుందని తెలిపారు. థర్మల్ యూనిట్లకు బొగ్గు సరఫరా, విద్యుత్ ఉత్పత్తిపై జెన్‌కో ఎండి కెవిఎన్ చక్రధర్ బాబుతో కలిసి ఆదివారం వర్చువల్ సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం జెన్‌కో, ఆంధ్రప్రదేశ్ పవర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ 7989 ఎండబ్ల్యు సామర్ధ్యాన్ని కలిగి ఉందని పేర్కొన్నారు. దీనికోసం ఎంసిఎల్ నుంచి ఏడాదికి 17.165 మిలియన్ మెట్రిక్ టన్నులు(ఎంఎంటి), సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్(ఎస్‌సిసిఎల్) నుంచి 6.88 ఎంఎంటిల బొగ్గు సరఫరా అవుతుందని తెలిపారు. జెన్‌కో ఎండి కెవిఎన్ చక్రధర్ బాబు మాట్లాడుతూ ఏప్రిల్ 20న రాష్ట్ర విద్యుత్ డిమాండ్ 247 మిలియన్ యూనిట్లకు చేరుకుందని, ఇది రాష్ట్రచరిత్రలోనే అత్యధికమని పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తిలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలను జెన్‌కో తీసుకుంటుందని తెలిపారు. ఈ సమావేశంలో జెన్‌కో డైరెక్టర్లు చంద్రశేఖర్ రాజు, ఆంటోనీ రాజా, వెంకటేశ్వర్లు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501**కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

## చెన్నై విమానాశ్రయంలో వివాహిత ఆత్మహత్య

**చెన్నై :** చెన్నై విమానాశ్రయంలో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. విమానాశ్రయం ఆవరణలో కొత్తగా నిర్మించిన మల్టీలెవెల్ పార్కింగ్ టెర్మినల్‌పై నుంచి దూకి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. మృతురాలిని ఐశ్వర్య(35)గా గుర్తించారు. పీఎస్-2 చిత్రాన్ని వీక్షించేందుకు తన ఇద్దరు పిల్లలతో వచ్చిన ఐశ్వర్య సినిమా మధ్యలోనే చిన్నారులను థియేటర్‌లో వదిలి బయటకు వచ్చేసింది. ఆ తరువాత, పార్కింగ్ భవంతి నాలుగో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. పార్కింగ్ సిబ్బంది ఐశ్వర్యను గుర్తించి ఆమెను వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మరణించినట్టు వైద్యులు తెలిపారు. తల్లి మరణ వార్త తెలియని 9వ తరగతి, 5వ తరగతి చదువుతున్న ఆమె కుమారుడు, కుమార్తె సినిమా చూస్తూ ఉండిపోయారు. చివరకు తల్లి కనిపించకపోవడంతో ఆందోళన చెందారు. ప్రస్తుతం వారు పోలీసుల సంరక్షణలోనే ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, ఐశ్వర్య ఆత్మహత్యకు గల కారణాలు వెలికి తీసేందుకు దర్యాప్తు ప్రారంభించారు.

## ప్రధాని మోడీని నిలదీసిన టిఎంసి ఎంపి

**న్యూఢిల్లీ :** ప్రధాని మోడీపై తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఎంపి మహువా మొయిత్రా ఆదివారం విరుచుకుపడ్డారు. ప్రధాని 100వ మన్ కీ బాత్ కార్యక్రమం సందర్భంగా టిఎంసి ఎంపి మహువా మొయిత్రా రెండు కీలకాంశాలపై ప్రధాని స్పందించాలని పట్టుబట్టారు. డబ్ల్యుఎఫ్ఐ చీఫ్, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా రెజ్లర్లు చేపట్టిన నిరసనల నేపథ్యంలో ఈ అంశాన్ని పరిష్కరించాలని ఆమె కోరారు. అలాగే అదానీ గ్రూపుపై హిండెన్ బర్గ్ నివేదికపై సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా - సెబి విచారణపైనా దృష్టి సారించాలని మహువా మొయిత్ర పేర్కొన్నారు. " మోడీగారు.. మన్ కీ బాత్ వందో ఎపిసోడ్ ఆదివారం దేశవ్యాప్తంగా, ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలోనూ ప్రసారం కాబోతోంది. ముందుగా ఈ అంశాలపై వివరణ ఇవ్వండి.. 1. బిజెపి భక్షకుల నుండి అథ్లెట్లను ఎందుకు రక్షించలేకపోతున్నారు. 2. సుప్రీంకోర్టు కాలపరిమితిలో అదానీ గ్రూప్ కుంభకోణంపై సెబీ ఎందుకు విచారణను పూర్తి చేయలేదు. ధన్యవాదాలు" అని ఆమె ట్వీట్ చేశారు.

ప్రధాని మోడీ మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్ ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రత్యక్ష ప్రసారమైన సంగతి తెలిసిందే.



విజయవాడలో ఎర్రజెండా వర్ధిల్లాలి పాటకు నృత్యం చేస్తున్న చిన్నారులు



విశాఖలో కోలాటంతో ఆకట్టుకున్న మహిళా కళాకారులు

# కోలాహలంగా మేడే సాంస్కృతిక ఉత్సవాలు

- అలరించిన నృత్యాలు, డ్యాన్స్‌లు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడేను పురస్కరించుకుని విశాఖ, విజయవాడల్లో కార్మిక సంఘాలు, వారి కుటుంబాలు కోలాహలంగా ఆదివారం సాంస్కృతిక ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విజయవాడ నగరంలో జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యాన సిద్ధార్థ అకాడమీ ఆడిటోరియంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ, బిల్డింగ్ కార్మికులు, రాజీవ్‌నగర్ వాసులు, ఇంటిపనివారల సంఘాలు ప్రదర్శించిన నృత్యాలు, డ్యాన్స్‌లు, లఘునాటికలు, ఏకపాత్రలు అలరించాయి. మేడే పాటకు అంగన్‌వాడీ కార్మికులు ప్రదర్శించిన నృత్యం విశేషంగా ఆకట్టుకుంది. తెలుగు పలుకులు కులికే అనే పాటకు అనూషా నాయుడు బృందం శాస్త్రీయనృత్యాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు పాల్గొని మాట్లాడుతూ కార్మిక వర్గం తమ హక్కుల కోసం పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని తెలిపారు. ప్రభుత్వ రంగాన్ని ఒక్కొక్కటిగా అమ్మేస్తూ కార్మికులకు ఉపాధి లేకుండా చేస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో కార్మిక లోకం ఒక్కటై పోరాడాలని పిలుపునిచ్చారు. జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంబివికె ట్రస్టు చైర్మన్ పి.మధు, ఎంబివికె బాధ్యులు స్వరూపరాణి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పాల్గొని మాట్లాడారు. సమన్విత బాధ్యులు డాక్టర్ డి.శమంతకమణి ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. జాషువా సాంస్కృతిక వేదిక బాధ్యులు డి.వి.రాజు, ఐజాక్ న్యూటన్, నరేన్ పాల్గొన్నారు.

విశాఖ నగరంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రం సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో మేడే సాంస్కృతిక ఉత్సవాలు ఘనంగా సాగాయి. మహిళల కోలాటం, కూచిపూడి నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా హాజరైన కళాభారతి ఆడిటోరియం అధ్యక్షులు ఎంఎస్ఎన్.రాజు, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ దుర్గాప్రసాద్, మల్లీశ్వరి ఆర్ట్స్ చైర్మన్ కొరటాల ప్రభాకరరావు, క్రియేటివ్ కామెడీ క్లబ్ కార్యదర్శి మేడా మస్తాన్‌రెడ్డి వారి సందేశాలను అందించారు. వ్యాఖ్యాతలుగా ఎం.శ్రీకాంత్, నాంచారయ్య వ్యవహరించారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల నిర్వహణ ఇన్‌ఛార్జి జివిఎస్.రాజేశ్వరరావు, సాంస్కృతిక విభాగం ఇన్‌ఛార్జి దండు నాగేశ్వరరావు, షార్ట్ ఫిలిమ్స్ ఇన్‌ఛార్జి ఎం.ఎల్లాజీ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## సమస్యలు పరిష్కారమయ్యేదాకా నల్ల బ్యాడ్జీలతోనే విధులు

- మే 8 నుంచి వివిధ రూపాల్లో ఆందోళనలు
- ఉద్యమ కార్యాచరణ ప్రకటించిన జెఎసి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన కొనసాగించాలని ఎపిజెఎసి అమరావతి నిర్ణయించింది. కలెక్టర్లకు విన్నపాలు, ప్రాంతీయ సదస్సులు, నిరసన ప్రదర్శనలు వంటి వివిధ రూపాల్లో మే 12 నుంచి 19 వరకు ఆందోళనలు కొనసాగించాలని పిలుపునిచ్చింది. విజయవాడ లెనిన్ సెంటర్‌లోని రెవెన్యూ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మూడో దశ ఉద్యమ కార్యాచరణ షెడ్యూల్‌ను జెఎసి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, అసోసియేట్ ఛైర్మన్ టిడి ఫణిపేర్రాజు, సెక్రటరీ జనరల్ పి.దామోదరరావు, కోశాధికారి వివి మురళీకృష్ణ నాయుడు విడుదల చేశారు.

**ఇదీ షెడ్యూలు :** రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులపై అక్రమ కేసులు/సస్పెన్షన్లను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, వేధింపులను విడనాడి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మే 8న కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పించనున్నారు. ఇదే నెల 9న శ్రీకాకుళంలో మొదటి ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తారు. ఈ నెల 12 నుంచి 19 వరకు 'ఉద్యోగుల అవేదనను చెబుదాం' అనే పేరుతో 175 మంది ఎమ్మెల్యేలు, 25 మంది ఎంపిలకు ఆయా జిల్లాల్లో వినతి పత్రాలు సమర్పించనున్నారు. 17న రెండవ ప్రాంతీయ సదస్సు అనంతపురంలోనూ, మూడో ప్రాంతీయ సదస్సు 27న ఏలూరులోనూ నిర్వహిస్తారు. 30న అన్ని జిల్లా కేంద్రాల్లో ఒక్క రోజు సామూహిక నిరాహారదీక్ష చేపట్టనున్నారు. ఆ తర్వాత జూన్ 8న గుంటూరులో నాల్గో ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తారు.

## ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలి

- ఉద్యోగ పోరాట సమితి డిమాండ్
- మే 30న విజయవాడలో ధర్నా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, మెగా డిఎస్సితో పాటు అన్ని శాఖల్లోనూ నియామకాలకు నోటిఫికేషన్లు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. శాఖల వారీగా పోస్టుల ఖాళీలపై వాస్తవిక సమాచారంతో శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. ఇదే డిమాండ్లతో ఈ నెల 30న విజయవాడలో ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. విజయవాడలోని దాసరి భవన్‌లో డివైఎఫ్ఐ, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు జి రామన్న, లెనిన్‌బాబు, ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు, కె ప్రసన్నకుమార్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజేష్ మీడియాతో మాట్లాడారు. ప్రతి ఏటా జాబ్ కేలండర్ విడుదల చేస్తామని సిఎం జగన్ ఎన్నికల సమయంలో హామీనిచ్చారని గుర్తుచేశారు. దీనిని అమలు చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. నాలుగేళ్ల నుంచి డిఎస్‌సి నోటిఫికేషన్ రాక నిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని వాపోయారు. గ్రామ, వార్డు, సచివాలయాల్లో ఖాళీగా 20 వేల పోస్టులు ఉన్నాయని తెలిపారు. ఉద్యోగాలు భర్తీ చేయకుండా ఉపాధి కల్పించకుండా ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పెంచుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అన్ని శాఖల్లో నియామకాల భర్తీ చేపట్టాలని డిమాండ్ చేశారు. సిలబస్‌లో మార్పులు చేయకుండా గ్రూప్-1, 2 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ఉద్యోగాల నోటిఫికేషన్ల విడుదల కోసం ఈ నెల 1 నుంచి 20 వరకు జిల్లా కేంద్రాలు, రెవిన్యూ డివిజన్లలో నిరుద్యోగులు, విద్యార్థి, యువజన సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లకు వినతిపత్రాలు అందిస్తామని చెప్పారు. మే 30న విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నా చేపడుతామన్నారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పి రాజేంద్రబాబు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సోమేశ్వరరావు, డివైఎఫ్ఐ నాయకులు కృష్ణ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు గోవింద రాజులు, శ్రీనివాస్, మధు తదితరులు పాల్గొన్నారు.

# కొంకణ్ రిఫైనరీ వద్దు

- ప్రభుత్వ భూసర్వేను వ్యతిరేకిస్తున్న స్థానికులు
- మహారాష్ట్ర సర్కారు తీరుపై ఆగ్రహం
- నిరసనలు తీవ్రతరం.. అదుపులోకి వందలాది మంది.. పలువురి అరెస్టు

**ముంబయి :** మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లాలో కొంకణ్ ఆయిల్ రిఫైనరీ చిచ్చు రేపుతున్నది. ప్రతిపాది రిఫైనరీని బర్సు-సోల్గావ్, దాని చుట్టుపక్కల ఎనిమిది గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఈ ప్రాంతంలో రిఫైనరీ కోసం ఒక పక్క ప్రభుత్వం భూసర్వే ప్రక్రియకు నిర్ణయం తీసుకున్నది. ఆయిల్ రిఫైనరీతో భూములకు, పర్యావరణానికి నష్టం కలిగిస్తుందని ఇక్కడి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా స్థానికులు తమ ఆందోళనలను మరింత తీవ్రతరం చేశారు. రిఫైనరీ ఏర్పాటు విషయంలో వెనక్కి తగ్గాలని వారు డిమాండ్ చేశారు. వారి డిమాండ్లను మాత్రం రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పైగా ప్రజాస్వామ్యయుతంగా చేస్తున్న ఈ నిరసనలను బీజేపీ సంకీర్ణ సర్కారు అణచివేస్తున్నది. నిరసనలు ఉధృతం కావడంతో ప్రభుత్వంలో అలజడి చెలరేగింది. ఇప్పటికే వందలాది మందిని నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పలువురిని అరెస్టు చేశారు. అంతటితో ఆగక.. పోలీసులు నిరసనకారులపై లాఠీచార్జ్‌కు దిగారు. టియర్ గ్యాస్‌ను కూడా ప్రయోగించారు. దీంతో పలువురికి గాయాలయ్యాయి. ఈ నిరసనకారుల్లో మహిళలు కూడా ఉండటం గమనార్హం. అరెస్టు చేసిన వారిని రాజ్‌పూర్ కోర్టులో ప్రవేశపెట్టారు. అయితే కోర్టు వారికి బెయిల్‌ను మంజూరు చేసింది.

ప్రతిపాదిత ప్రాజెక్టు వ్యతిరేకత రావడం ఇది కొత్తేం కాదు. దీనిపై వ్యతిరేకత ఎప్పటి నుంచో ఉన్నది. అయితే, ఇక్కడి ప్రజల అభీష్టాన్ని ఏ మాత్రమూ పట్టించుకోకుండా ఈ ప్రాంతంలో నేల సర్వేకు ముందుకెళ్లడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ఇక్కడి స్థానికుల్లో తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించింది. దీంతో గత వారం నుంచి స్థానికులు ఆందోళనలను మరింతగా తీవ్రతరం చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసనలు చేశారు. అయితే, స్థానికుల నిరసనలకు ఇటు రాజకీయంగానూ మద్దతు లభించింది. ఆందోళనలను ఉద్ధవ్ థాక్రే వర్గం సమర్థించింది. రిఫైనరీ ప్రాజెక్టు విషయంలో షిండే-ఫడ్నవీస్ సర్కారు తీరుపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. భారత ఆయిల్ కార్పొరేషన్ భారత్ పెట్రోలియం, హిందూస్తాన్ పెట్రోలియం, సౌదీ అరేబియా దిగ్గజ కంపెనీ అరామ్‌కో, యూఏఈకి చెందిన జాతీయ ఆయల్ కంపెనీ ల జాయింట్ వెంచర్ ప్రతిపాదిత కొంకన్ రిఫైనరీ ప్రాజెక్టు. తొలుత దీనిని 2015లో రత్నగిరి జిల్లాలోని ప్రాంతంలో ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించారు.

## ట్విట్టర్ పేరెంటల్ లీవ్ 14 రోజులకు కుదింపు

**వాషింగ్టన్ :** ట్విట్టర్ సంస్థ మాతృత్వ లేదా పితృత్వ సెలవులను 20 వారాల నుంచి 14 రోజులకు కుదించినట్లు న్యూయార్క్ టైమ్స్ కథనం పేర్కొంది. లేదా ఆయా ప్రాంతాల్లో ఉండే స్థానిక చట్టాలకు అనుగుణంగా సెలవులు ఉంటాయని స్పష్టం చేస్తూ ఉద్యోగులకు అంతర్గతంగా సమాచారం అందించినట్లు తెలిపింది. తాజాగా ట్విట్టర్ అధినేత ఎలన్ మస్క్ తీసుకున్న ఈ నిర్ణయం ఆయా రాష్ట్రాల్లోని ఉద్యోగులపై తీవ్ర ప్రభావం చూపనుంది. గతంలో ట్విట్టర్ ఉద్యోగులకు 20 వారాల పెయిడ్ పేరెంటల్ లీవ్‌ను అందించేంది. 'అంతర్గత పత్రాల ప్రకారం .. రెండు వారాల సెలవులకు చెల్లింపులు జరపడంతోపాటు ఉద్యోగులు పనిచేసే ప్రాంతంలో చట్టం ప్రకారం మార్పులు చేసినట్లు' న్యూయార్క్ టైమ్స్ రిపోర్టర్ కేట్ కాంగర్ ఓ ట్వీట్‌లో తెలిపారు. ఈ తరహా సెలవులపై అమెరికాలో ఎలాంటి నియమ నిబంధనలు లేవు. ఆయా రాష్ట్రాల్లో ప్రత్యేకంగా చట్టాలు ఉన్నాయి. వాటిని స్థానికంగా ఉండే కంపెనీలు పాటించాల్సి ఉంటుంది.

## ఎయిరిండియా సిఇఒకు డిజిసిఎ షోకాజ్ నోటీసులు

**న్యూఢిల్లీ :** పౌర విమానయాన నియంత్రణ సంస్థ (డిజిసిఎ) ఎయిరిండియా సిఇఒ క్యాంప్‌బెల్ విల్సన్‌కు షోకాజ్ నోటీసులిచ్చింది. ఎయిరిండియా విమానంలోకి ఓ పైలెట్ తన స్నేహితురాలిని కాక్‌పిట్‌లోకి ఆహ్వానించిన ఘటనపై ఎయిర్‌లైన్స్ నివేదిక సమర్పించకపోవడంపై డిజిసిఎ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ఓ సీనియర్ అధికారి తెలిపారు. ఎయిరిండియా భద్రత, రక్షణ- నాణ్యత హెడ్‌కి కూడా నోటీసులిచ్చినట్లు ఆ అధికారి పేర్కొన్నారు. ఏప్రిల్ 21నే నోటీసులు జారీ అయ్యాయని, 15 రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో ఆదేశించారని తెలిపారు. ఫిబ్రవరి 27న దుబాయ్ నుండి ఢిల్లీ వచ్చిన ఎయిరిండియా విమానంలో పైలెట్ తన స్నేహితురాలిని కాక్‌పిట్‌లోకి తీసుకువెళ్లిన సంగతి తెలిసిందే.

## 26 నుంచి దేశవ్యాప్త ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

సరిహద్దులకు చేరిన రోజున, అఖిల భారత విజయ్ దివస్ సందర్భంగా అన్ని రాష్ట్ర రాజధానుల్లో కనీసం మూడు రోజుల పాటు పగలు-రాత్రి ధర్నా నిర్వహిస్తామని చెప్పారు.

**తీర్మానాలు**

ఎస్‌కెఎం జాతీయ సమావేశం మూడు తీర్మానాలను ఆమోదించింది. బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నాలో కూర్చున్న భారత మహిళా రెజ్లర్ల నిరసనకు ఎస్‌కెఎం సంపూర్ణ మద్దతు ఇచ్చింది. బిజెపి ఎంపిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. "రైతుల ఉద్యమానికి, ఎస్‌కెఎంకి మద్దతుదారుగా ఉన్న మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్‌పై బిజెపి ప్రభుత్వం సిబిఐ వంటి సెంట్రల్ ఏజెన్సీలతో దాడి చేయడాన్ని ఎస్‌కెఎం ఖండించింది. మాలిక్ ధైర్యాన్ని ఎస్‌కెఎం కొనియాడింది. చారిత్రాత్మక ఢిల్లీ రైతాంగ పోరాటానికి మద్దతిచ్చి కొంత నిధులను విరాళంగా అందించినందున, దేశంలోని తపాలా ఉద్యోగుల సంఘాలు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్, ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ల గుర్తింపును ప్రభుత్వం రద్దు చేయడాన్ని ఎస్‌కెఎం ఖండించింది. ఆయా సంఘాలకు సంఘీభావం తెలియజేసింది. గుర్తింపు రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది.

# ఆదిరెడ్డి అప్పారావు, వాసు అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

వాదనలు కొనసాగుతున్నాయి.

ఆదిరెడ్డి కుటుంబీకులు జగజ్జననీ చిట్ ఫండ్ కంపెనీ నిర్వహిస్తున్నారు. గత నవంబరు నుంచి రాష్ట్రంలో చిట్‌ఫండ్ కంపెనీల్లో రిజిస్ట్రేషన్ శాఖ తనిఖీలు చేపట్టిన విషయం విదితమే. మార్చి 16న జగజ్జనని చిట్స్ సంస్థలోనూ తనిఖీలు చేపట్టారు. ఇందులో వెలుగు చూసిన అంశాల ఆధారంగా సిఐడికి కాకినాడ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఫిర్యాదు చేశారు. నకిలీ ఖాతాలను సృష్టించి మోసాలకు, చిట్స్ చెల్లింపులలో అక్రమాలకు పాల్పడ్డారని, 1982 చిట్ ఫండ్ చట్టాన్ని ఉల్లంఘించి చిట్‌ఫండ్ నిధులతో ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నారని ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో, చిట్‌ఫండ్స్ డైరెక్టర్లైన ఆదిరెడ్డి అప్పారావు, వాసులను సిఐడి అధికారులు అరెస్టు చేశారు. చిట్‌ఫండ్‌కు సంబంధించి జిఎస్‌టి అధికారులు గతంలో కేసు పెట్టారని, అప్పట్లో ఈ కేసులో వారిద్దరూ బెయిల్ తెచ్చుకున్నారని, హైకోర్టు నుంచి 'నాట్ టూ అరెస్టు' ఆర్డర్ కూడా తీసుకున్నారని టిడిపి నాయకులు విమర్శిస్తున్నారు. ఈ నెలాఖరులో టిడిపి మహానాడు రాజమహేంద్రవంలో నిర్వహించేందుకు ఆ పార్టీ శ్రేణులు సన్నద్ధమవుతున్నాయని, ఈ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారనే కక్ష సాధింపుతో కేసులో ఇరికించి అక్రమంగా అరెస్టు చేశారని వారు ఆరోపిస్తున్నారు.

**సిఐడి కార్యాలయం వద్దకు భారీగా టిడిపి శ్రేణులు**

ఆదిరెడ్డి అప్పారావు, వాసుల అరెస్టు విషయం తెలిసిన కొద్దిసేపటికే రాజమహేంద్రవరంలో హై టెన్షన్ నెలకొంది. టిడిపి శ్రేణులు సిఐడి రీజినల్ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో చేరుకున్నాయి. దీంతో, సిఐడి అధికారులు ఆ కార్యాలయం గేట్లు మూసివేసి లోనికి ఎవ్వరినీ అనుమతించలేదు. వాసు భార్య ఆదిరెడ్డి భవానిని కూడా గేటు బయటే ఆపేశారు.

**చంద్రబాబు ఖండన**

ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి శ్రీనివాస్‌ల అరెస్టులను టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ఖండించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో రాజకీయ వేధింపులు, కక్ష సాధింపులు పెరిగాయని విమర్శించారు. సిఐడి అనేది దర్యాప్తు ఏజెన్సీనా? లేక వైసిపి వేధింపుల ఏజెన్సీనా? అంటూ ప్రశ్నించారు. కోర్టులతో చీవాట్లు తిన్నా ప్రభుత్వం బుద్ధి మారకపోవడం సిఎం జగన్ విషపు రాజకీయాలకు నిదర్శనమని దుయ్యబట్టారు ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. అక్రమ అరెస్టు దుర్మార్గమని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బిసిలంటే జగన్‌కు ఎందుకంత బిపి అని టిడిపి ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ అరాచకాలు, కక్షసాధింపులు రోజురోజుకు మితిమీరిపోతున్నాయని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మరో ప్రకటనలో విమర్శించారు.



దీక్షల్లో కూర్చున్న వైఎస్ఆర్‌టియుసి కార్యకర్తలు, పోరాట కమిటీ నేతలు

## ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- వైఎస్ఆర్‌టియుసి స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వైఎస్ఆర్‌టియుసి స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పిట్టా రెడ్డి అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 808వ రోజుకు చేరాయి. దీక్షల్లో వైఎస్ఆర్‌టియుసి కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమం కొనసాగుతోందన్నారు. ప్రజా, కార్మిక, శ్రామిక వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ కేంద్ర ప్రభుత్వం ఒంటెద్దు పోకడతో పరిపాలన సాగిస్తోందని విమర్శించారు. ఎంతటి పోరాటం చేసైనా స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వై.మస్తానప్ప, కెఎస్ఎన్.రావు, సంపంగి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



తిరుపతిలో శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కవులు, రచయితలు

## పేదవాని గొంతుక శ్రీశ్రీ

- జయంతి సభల్లో వక్తలు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ

'పేదవాడి గొంతుక శ్రీశ్రీ.. బాధితుడికి భరోసా శ్రీశ్రీ..' అని శ్రీరంగం శ్రీనివాసరావు జయంతి సభలో పలువురు వక్తలు అన్నారు. మహాకవి శ్రీ శ్రీ జయంతి వేడుకలు ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఆయన చిత్ర పటాలకు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అభ్యుదయ భావాలతో రచనలు చేసి జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వైతాళికుడని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేస్తామని ప్రతినబూనారు. తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో సాహితీ స్రవంతి, వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన శ్రీశ్రీ జయంతి సభ నిర్వహించారు. ఎస్‌వియు ఒఆర్ఐ ఆచార్య పిసి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో రాయలసీమ పోరాట సమితి అధ్యక్షులు భూమన్ మాట్లాడుతూ సమాజాన్ని చైతన్యం చేసేందుకు సాహితీవేత్తలు, రచయితలు, మేధావులు కంకణబద్దులు కావాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో మానస వికాసవేదిక కన్వీనరు సాకం నాగరాజు, తెలుగుబాషోద్యమ సమితి అధ్యక్షురాలు గంగవరపు శ్రీదేవి, తిరుపతి బాలోత్సవం గౌరవధ్యక్షులు టెంకాలయ దామోదరం, టి.రామచంద్రారెడ్డి, ఓవి రమణ, వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎం.నాగార్జున పాల్గొన్నారు. కర్నూలు నగరంలోని టిజివి కళాక్షేత్రం ఆధ్వర్యాన కళాక్షేత్రం సాహిత్య వేదిక సమావేశ మందిరంలో జరిగిన సభలో నంది అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య మాట్లాడుతూ భారతీయ సాహిత్యంలో చెరగని ముద్ర వేసిన మహాకవి శ్రీశ్రీ అని కొనియాడారు. నంద్యాలలోని నూనెపల్లి భగత్ సింగ్ జనచైతన్య గ్రంథాలయంలో అరసం ఆధ్వర్యంలో శ్రీశ్రీ జయంతి వేడుకలను నిర్వహించారు. గుంటూరులో మాజీ మంత్రి డొక్కా మాణిక్య ప్రసాద్ శ్రీశ్రీకి నివాళులర్పించారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో లిమ్రా ఇనిస్టిట్యూట్‌లో అంతర్జాతీయ సాహిత్య సేవా సంస్థ, శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. కృష్ణా, తూర్పుగోదావరి, నెల్లూరు జిల్లాల్లో శ్రీశ్రీ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి.

## తిరుమల పరకామణిలో చోరీ

ప్రజాశక్తి - తిరుమల

తిరుమలలోని నూతన పరకామణి మండపంలో ఆదివారం చోరీ జరిగింది. 900 యుఎస్ డాలర్లను చోరీకి పాల్పడుతూ ఓ వ్యక్తి విజిలెన్స్ అధికారులకు దొరికిపోయాడు. విజిలెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. పరకామణిలో నోట్ల లెక్కింపు సమయంలో విదేశీ నోట్లను మలమార్గం వద్ద ఉంచుకుని బయటకు వెళ్తున్న కాంట్రాక్టు ఉద్యోగి రవికుమార్‌ను సిసి కెమెరాల ద్వారా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పరకామణి మండపంలో కట్టుదిట్టమైన భద్రత ఉన్నప్పటికీ చోరీకి పాల్పడడం చర్చనీయాంశంగా మారింది.

## అకాల వర్షం.. అపార నష్టం

(మొదటి పేజీ తరువాయి)

వీపు భాగంలో పిడుగుపడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనకు భార్య మాధవి, ఇద్దరు పిల్లలు గోపి నారాయణ ఉన్నారు.

**కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో 34 గొర్రెలు మృత్యువాత**

పిడుగుపాటుకు కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో 44 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. కర్నూలు జిల్లా చిప్పగిరిమండలం నగరడోన పంచాయతీలోని తిమ్మాపురం గ్రామ సమీపంలో పిడుగుపడింది. 34 గొర్రెలు మృతి చెందాయి. వీటిలో కొత్తపేట భీమన్నకు చెందిన 15 గొర్రెలు, తిమ్మాపురానికి చెందిన సీను, జయరాముడు, హుస్సేన్ సాహెబ్, సురేష్ చెందిన 15 గొర్రెలు ఉన్నాయి. ప్రకాశం జిల్లా ఇరకలగుండంలో పిడుగుపాటుకు పది గొర్రెలు మృతి చెందాయి.

## బిజెపిని గద్దె దించుదాం

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు జిల్లా ఆదోనిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2024లో బిజెపికి పూర్తి స్థాయిలో మెజార్టీ వస్తే భారత రాజ్యాంగాన్ని మారుస్తుందనే దానిలో ఎలాంటి సందేహమూ లేదన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టి అధికారాన్ని కాపాడుకోవాలనే ప్రయత్నాల్లో మోడీ ప్రభుత్వం ఉందని విమర్శించారు. మోడీని గద్దె దింపి దేశానికి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆదోని డివిజన్ సిపిఎం, సిపిఐ కార్యదర్శులు లింగన్న, సుదర్శన్ అధ్యక్షత వహించారు.

అనకాపల్లిలోని దొడ్డి రామునాయుడు కార్మిక, కర్షక నిలయంలో జరిగిన ప్రచారభేరి ముగింపు సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిపిఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తోన్న విధానాలతో దేశ ప్రగతికి తీవ్ర విఘాతం ఏర్పడుతోందని, మతోన్మాద పార్టీని ఓడించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. మోడీ విధానాల వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని తెలిపారు. త్యాగాలతో ఏర్పడ్డ వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టడం దారుణమన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు.

## రైల్వే లోకో పైలెట్ల సమస్యలను పరిష్కరించాలి

- ఆలిండియా లోకో రన్నింగ్‌స్టాఫ్ అసోసియేషన్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రైల్వే లోకో పైలెట్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. విజయవాడ రైల్వే ఇనిస్టిట్యూట్‌లో ఎఐఎల్‌ఆర్‌ఎస్‌ఎ విజయవాడ డివిజన్ సమావేశం బ్రాంచ్ ప్రెసిడెంట్ కె రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సభలో దక్షిణ మధ్య రైల్వే మాజీ జోనల్ సెక్రటరీ ఎస్ గురుమూర్తి మాట్లాడుతూ సీలింగ్ పరిమితి ఎన్‌డిఎని ఉపసంహరించుకోవాలని, ఎన్‌పిఎస్‌ను రద్దు చేసి రైల్వే ఉద్యోగులందరికీ ఓపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 80 శాతం సీనియర్ ఎఎల్‌పి పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. లేడీ రన్నింగ్ స్టాఫ్‌కి సరైన సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధిక పని గంటలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ సెక్రటరీ కె రామకృష్ణ, బ్రాంచ్ సెక్రటరీ పి రాము పాల్గొన్నారు.

## మన్ కీ బాత్ స్ఫూర్తిదాయకం : గవర్నర్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ప్రధానమంత్రి మోడీ మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్ కార్యక్రమం ప్రజలందరికీ స్ఫూర్తిదాయకమని రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించిన 'మన్ కీ బాత్' స్క్రీనింగ్‌కు ఆయన రాజ్‌భవన్ నుంచి పాల్గొన్నారు. స్వచ్ఛ భారత్ అభియాన్, బేటీ బచావో బేటీ పడావో, కోవిడ్-19 టీకా వంటి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేసేలా మన్ కీ బాత్ ప్రేరణ ఇచ్చిందని అబ్దుల్ అన్నారు. ఈ కార్యక్రమాన్ని దేశ నలుమూలలకూ,అన్ని భాషలూ, మాండలికాల్లోనూ అందుబాటులో ఉంచేందుకు ప్రసార భారతి కృషి అభినందనీయమని గవర్నర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దూరదర్శన్ డిడిజి డాక్టర్ రంగనాథం, ఆకాశవాణి డిడిజి సోమేశ్వరరావు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రధాని మన్‌కీబాత్ ప్రజాద్రోహమే : కాంగ్రెస్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ప్రజల సమస్యలు పట్టించుకోకుండా చట్టసభలను లెక్క చేయకుండా మన్‌కీబాత్ పేరుతో ప్రధాని ప్రచారం చేసుకోవడం ప్రజలను మభ్య పెట్టడం తప్ప మరొకటి కాదని కాంగ్రెస్ నాయకులు కె.శివాజి విమర్శించారు. దీనిపై ఆదివారం ప్రకటన విడుదల చేశారు. రాజ్యాంగం ప్రకారం ఏర్పడిన చట్టసభలను స్వతంత్రంగా పనిచేయనీయకుండా డబ్బులు ఇచ్చినవారి కొమ్ము కాస్తున్నాడని తెలిపారు. ప్రతి ఒక్కరి అకౌంట్లో రూ.15 లక్షలు వేస్తానన్నాని, ఇంతవరకు ఒక్కరికి కూడా ఒక్క రూపాయి వచ్చిన దాఖలా లేదని తెలిపారు. వీటన్నిటికీ ప్రధాని సమాధానం చెప్పాలని కోరారు.

# ఉల్లాసం.. ఉత్సాహం

- సందడిగా హేలాపురి వేసవి ఉత్సవం
- నేటి బాలలే రేపటి జాతి సంపద : ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ

**ప్రజాశక్తి - ఏలూరు**



ఫొటో:వేసవి ఉత్సవంలో పాల్గొన్న చిన్నారులతో ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, నిర్వాహకులు

హేలాపురి వేసవి ఉత్సవం ఏలూరులో ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగింది. గవరవరంలోని సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం కమిటీ ఆధ్వర్యాన తొలి హేలాపురి వేసవి ఉత్సవ కార్యక్రమాలు ఆదివారం పెద్దఎత్తున సాగాయి. ప్రారంభ సభకు హేలాపురి వేసవి ఉత్సవం అధ్యక్షులు కస్తూరిరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మాట్లాడుతూ.. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం, మానవత, వివిధ రోటరీ, లైన్స్ క్లబ్‌లు ప్రతియేటా నిర్వహిస్తున్న బాలల పండుగలు నగరవాసులకు కనువిందు చేస్తున్నాయన్నారు. ఈ ఉత్సవాల్లో చిన్నారులు ప్రదర్శిస్తున్న హావభావాలు చూస్తుంటే ఎంతో ఆనందం కలుగుతుందని తెలిపారు. నేటి బాలలు రేపటి జాతి సంపదని, వారికి పెద్దలు, దేశం, సమాజం పట్ల బాధ్యతను నేర్పుతూ పెంచాలన్నారు. పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను ప్రభుత్వాలు అందించడం ద్వారా భవిష్యత్తుకు మంచి సమాజాన్ని అందించగలుగుతామని తెలిపారు. హేలాపురి బాలోత్సవం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, కమిటీ ప్రధాన కార్యదర్శి అడుసుమిల్లి నిర్మల, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ మరియట్ట తదితరులు పాల్గొన్నారు. తొలుత జాతీయ పతకాన్ని ఎమ్మెల్సీ సాబ్జీ ఆవిష్కరించారు. హేలాపురి వేసవి ఉత్సవంలో ఎల్‌కెజి, యుకెజి పిల్లలు మొదలుకొని సీనియర్ సిటిజన్లు ఎంతో ఆనందంగా వివిధ పోటీల్లో పాల్గొన్నారు.

## కిడ్నీ రాకెట్ కేసులో ఆరుగురు అరెస్టు

- పరారీలో ప్రధాన నిందితుడు నార్ల వెంకటేశ్వరరావు
- సిసి కెమెరాలు ఆఫ్ చేసి పక్కా ప్రణాళికతో వ్యవహారం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)**



కేసు వివరాలు వెల్లడిస్తున్న సిపి త్రివిక్రమ వర్మ

విశాఖలో తీవ్ర కలకలం రేపిన కిడ్నీ రాకెట్ కేసులో ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మరికొందరి కోసం గాలిస్తున్నారు. నగర పోలీస్ కమిషనర్ సిఎం త్రివిక్రమ వర్మ తన కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం పెందుర్తి వాంబే కాలనీకి చెందిన జి వినయ్ కుమార్‌కు కిడ్నీ దానం చేస్తే రూ.8.50 లక్షలు ఇస్తామని కొందరు ఆశ చూపారు. దానికి సంబంధించి వినయ్ కుమార్ క్లినికల్ పరీక్షలకు, ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్‌కు హాజరయ్యారు. అనంతరం అతనికి రూ.ఐదు లక్షలు ఇచ్చినట్టు చూపించి రూ.2.50 లక్షలు మాత్రమే చెల్లించి మోసం చేశారు. దీంతో బాధితుడు ఏప్రిల్ 26న పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

**వ్యవహారం సాగిందిలా..**

కారు డ్రైవర్‌గా పని చేస్తున్న వినయ్ కుమార్‌తో వాంబే కాలనీకే చెందిన శ్రీను, అతని భార్య కొండమ్మ, కామరాజు, ఎలీనా పరిచయం పెంచుకున్నారు. వారంతా వినయ్‌కుమార్‌ను కిడ్నీ ఇవ్వడానికి ఒప్పించి మహారాణిపేటలో ఉంటున్న నార్ల వెంకటేశ్వరరావుకు పరిచయం చేశారు. ఈ క్రమంలోనే విజయ డయాగ్నస్టిక్ సెంటర్‌లో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శేఖర్ తప్పుడు పత్రాలు సృష్టించాడు. క్లినికల్ టెస్టులు అక్కడ కొన్ని చేయించాడు. మిగిలిన వాటిని అపోలో ఆస్పత్రిలో చేయించారు. అనంతరం నార్ల వెంకటేశ్వరరావు అనుచరులు రమేష్, పవన్ గతేడాది సెప్టెంబర్, అక్టోబర్ మధ్య కాలంలో పెందుర్తి వద్ద ఉన్న తిరుమల నర్సింగ్ హోమ్‌లోని డాక్టర్ పరమేశ్వరరావును సంప్రదించారు. ఆస్పత్రిలోని రెండో అంతస్తులో ఉన్న ఆపరేషన్ గదిని రూ. 50 వేలకు, వార్డు రూమ్‌ను రూ.10 వేలకు అద్దెకు తీసుకుని అక్కడి సిసి కెమెరాలు పనిచేయకుండా చేశారు. తొలుత పరీక్షల అనంతరం వినయ్ కుమార్ కిడ్నీ ఇచ్చేందుకు విముఖత చూపుతూ హైదరాబాద్ వెళ్లిపోగా అతన్ని బెదిరించి బలవంతంగా విశాఖకు రప్పించారు. పెందుర్తి తిరుమల హాస్పిటల్‌లో డిసెంబర్ మూడో వారంలో కిడ్నీ మార్పిడి చేశారు. కేసులో ప్రధాన నిందితునిగా ఉన్న నార్ల వెంకటేశ్వరరావు పరారీలో ఉండగా అతనికి సహకరించిన ఎలీనా, మడక కామరాజు, మద్ర శ్రీను, కొండమ్మ, ల్యాబ్ అసిస్టెంట్ శేఖర్, తిరుమల హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ పరమేశ్వరరావును పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడుతో పాటు ఆపరేషన్ చేసిన ఇద్దరు డాక్టర్లు, కిడ్నీ పొందిన వేరే రాష్ట్రానికి చెందిన వ్యక్తులను అరెస్ట్ చేయనున్నామని పోలీసు కమిషనర్ తెలిపారు.

## ప్యాలెస్‌లో దాక్కునే సిఎంను ప్రజలు కలిసేదెలా ? : సిపిఐ

**ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)**

నాలుగేళ్లపాటు ప్యాలెస్‌లో దాక్కున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ప్రజలు ఎలా కలుస్తారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ప్రశ్నించారు. ఆయనెప్పుడూ పరదాలు కట్టుకుని తిరుగుతుంటారని ఎద్దేవా చేశారు. విశాఖలోని సిపిఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ ఈ నెల తొమ్మిదిన సిఎం 'జగనన్నకు చెబుదాము' అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారని, వాస్తవంలో ఆయన్ని కలవడానికే అవకాశం లేదని, అలాంటప్పుడు ప్రజలు జగనన్నకు ఏం చెబుతారని ప్రశ్నించారు.

జగన్‌లాంటి నిర్బంధ ముఖ్యమంత్రిని ఎప్పుడూ చూడలేదన్నారు. ఈ నాలుగేళ్ల కాలంలో ఆయన ఒక ప్రెస్ మీట్ కూడా పెట్టలేదని విమర్శించారు. అన్నింటా రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేస్తున్నా ప్రశ్నించడం లేదని విమర్శించారు. తాడేపల్లిలోని సిఎం ప్యాలెస్ చుట్టూ ముళ్ల కంచె వేసి ఎవరినీ అటువైపు రానివ్వరని, చుట్టూ వందల మందితో పోలీసు పహారా ఉంటుందని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు ముఖ్యమంత్రిని ఎలా కలుస్తారని ప్రశ్నించారు. 31 కేసుల్లో ముద్దాయిగా ఉండి బెయిల్‌పైనున్న జగన్.. పరిస్థితి తారుమారైతే జైలుకు పోతారని, అలాంటిది ఆయనెలా ప్రజలకు నమ్మకం అవుతారని ఎద్దేవా చేశారు.

## 3న ఉత్తరాంధ్రలో సిఎం పర్యటన

- భోగాపురం విమానాశ్రయానికి శంకుస్థాపన
- సహా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మే నెల 3న విజయనగరం, విశాఖపట్టణం జిల్లాల్లో పర్యటించనున్నారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి 10 గంటలకు భోగాపురం మండలం ఎ రావివలసకు చేరుకుంటారు.10.25 గంటలకు అక్కడ నుంచి జిఎంఆర్ ఎక్స్‌పీరియన్స్‌సెంటర్‌కు చేరుకుంటారు. 10.30గంటలకు భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సిఎం శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం చింతపల్లి ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణం, తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్ట్ మిగులు పనులకు సంబంధించిన శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తారు. 10.55 గంటలకు సవిరవిల్లి వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకుంటారు. సభ అనంతరం మధ్యాహ్నం 1.20 గంటలకు అక్కడ నుంచి విశాఖపట్టణం చేరుకుంటారని సిఎంఓ తెలిపింది.

**విశాఖలో..**

అదే రోజు మధ్యాహ్నం 1.40 గంటలకు విశాఖ మధురవాడ ఐటి హిల్స్ నెంబరు 3 హెలిప్యాడ్‌కు సిఎం చేరుకుంటారు. మధ్యాహ్నం 2 గంటలకు వేదిక వద్దకు చేరుకుని, 2.30 గంటల నుంచి 3 గంటల మధ్య వైజాగ్ ఐటి టెక్‌పార్క్ శంకుస్థాపన కార్యక్రమంలో సిఎం పాల్గొంటారు. అనంతరం పారిశ్రామిక వేత్తలతో నిర్వహించే కార్యక్రమంలో ప్రసంగించనున్నారు. సాయంత్రం 3.50 గంటలకు రుషికొండలో విశాఖ ఎంపి ఎంవివి సత్యనారాయణ నివాసానికి వెళ్లారు. ఇటీవల వివాహం చేసుకున్న ఎంపి కుమారుని దంపతులను ఆశీర్వదిస్తారు. సాయంత్రం 5 గంటలకు మధురవాడ హెలిప్యాడ్ నుంచి బయలుదేరి 5.20 గంటలకు విశాఖపట్టణం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. సాయంత్రం 5.30 గంటలకు విశాఖ నుంచి బయలుదేరి 6.45 గంటలకు తాడేపల్లికి చేరుకుంటారని సిఎంఓ పేర్కొంది.


ఎమ్మిగనూరు బహిరంగసభలో మాట్లాడుతున్న నారా లోకేష్, వేదికపై బివి.జయనాగేశ్వరరెడ్డి

## చేనేతలకు రాయితీలు పునరుద్ధరిస్తాం

- యువగళంలో నారా లోకేష్

**ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి**

టిడిపి అధికారంలోకి రాగానే చేనేతలకు ముడిసరుకు రాయితీలు పునరుద్ధరిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర ఆదివారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నగర శివారు విడిది కేంద్రం నుండి ప్రారంభమైంది. ఎమ్మిగనూరు పుర వీధుల్లో యాత్ర సాగింది. పలు వర్గాల ప్రతినిధులు లోకేష్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఎమ్మిగనూరు సొసైటీ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే కేంద్రం మెడలు వంచి విభజన హామీలు సాధిస్తామని చెప్పిన జగన్ ప్రత్యేక హోదా ఎప్పుడు తెస్తారని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే జాబ్ కేలండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. వైసిపి ప్రభుత్వం మహిళల తాళిబొట్టు తాకట్టు పెట్టి మద్యం ద్వారా వచ్చే ఆదాయాన్ని చూపి రుణాలు తీసుకుంటోందని విమర్శించారు. రాయలసీమ రైతులకు రాయితీ డ్రిప్ ఇరిగేషన్ ఇస్తామని, పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, పోలీసుల బకాయిలు తీరుస్తామని హామీ ఇచ్చారు. బిసిలను ఆర్థికంగా, రాజకీయంగా ఆదుకుంటామన్నారు. చేనేతను ఆదుకోవడం కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తామని తెలిపారు. అనంతరం పాదయాత్రగా వెళ్లి ఎమ్మిగనూరు శివారు విడిది కేంద్రంలో లోకేష్ బస చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు భూమా అఖిల ప్రియ, అమరనాథ్ రెడ్డి, ఎమ్మిగనూరు నియోజకవర్గ టిడిపి ఇంఛార్జీ బివి జయనాగేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బిటి నాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షులు సోమిసెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలపై దశల వారీ పోరాటం

- ఎపిజిఇఎ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో అధ్యక్షులు సూర్యనారాయణ

**ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి**

ఉద్యోగుల న్యాయమైన కోర్కెల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీ పోరాటం నిర్వహించనున్నామని ఎపిజిఇఎ రాష్ట్ర అధ్యక్షులు కె.సూర్యనారాయణ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఎపిజిఇఎ రాష్ట్ర స్థాయి సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సూర్యనారాయణ విలేకర్లతో మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. గవర్నర్‌ను కలిసి తమ గోడు వెలిబుచ్చడంతో ప్రభుత్వం ఉద్యోగులప కక్ష సాధింపులకు పాల్పడుతోందని విమర్శించారు. ఈ ప్రభుత్వం ప్రతి ఉద్యోగికీ కనిష్టంగా రూ.5 లక్షల బకాయిలు ఉందన్నారు. డిఎ, పిఆర్‌సి, ప్రతి నెలా ఒకటిన వేతనాలు చెల్లించేలా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజ్ తదితర హామీలను అమలు చేయాలని కోరారు. అనంతరం భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించారు.

మే 5న ప్రభుత్వ కార్యదర్శికి నోటీసు అందజేయనున్నామని, మే 22న ప్రతి తాలూకా కేంద్రాల్లో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నామని తెలిపారు. సిపిఎస్ రద్దు కోరుతూ జూన్ 8న కలెక్టర్లు, ఆర్‌డిఒలకు, జూన్ 14న అంబేద్కర్ విగ్రహాలకు, జూన్ 21న గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేయనున్నామని చెప్పారు. 28, 29, 30 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. జులై 5 నుండి సెప్టెంబర్ 29 వరకు వివిధ జిల్లాల్లో ప్రదర్శనలు నిర్వహించనున్నామని తెలిపారు. అక్టోబరు 2న గాంధీ విగ్రహాల ఎదుట సత్యాగ్రహం (మౌనప్రదర్శన) చేపట్టనున్నామని అన్నారు. అక్టోబరు 9న విశాఖలో, 10న అనకాపల్లిలో, అక్టోబరు 28న అల్లూరి సీతారామరాజు జిల్లాలో అక్టోబరు 30 రాజమండ్రిలో బహిరంగ నిరసన ప్రదర్శనలు ఉంటాయన్నారు. అక్టోబరు 31న విజయవాడలో బహిరంగ సభ నిర్వహించనున్నామని తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే నవంబరు 1 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని స్పష్టం చేశారు.

## వైసిపి విముక్త ఆంధ్రప్రదేశ్ మా లక్ష్యం

- జనసేన నాయకులు నాదెండ్ల మనోహర్

**ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)**

వైసిపి విముక్త ఆంధ్రప్రదేశ్ తమ పార్టీ లక్ష్యమని జనసేన పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. విశాఖ దసపల్లా హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పార్టీ లక్ష్యం ఏమిటో గతంలోనే పవన్ కల్యాణ్ ప్రకటించారని తెలిపారు. అందులో భాగంగానే ఇటీవల చంద్రబాబుతో పవన్ సమావేశమయ్యారని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను వైసిపి నుంచి విముక్తి చేయడమే లక్ష్యంగా చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. సిఎం జగన్‌పై ప్రజల్లో నమ్మకం పోయిందన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాను ఎక్కడ కాపురం పెడితే అక్కడే పాలన అని సిఎం జగన్ ప్రకటించడాన్ని తప్పుబట్టారు. చీపురుపల్లిలోని బెవరపేటలో 'జగనన్నే మా నమ్మకం' స్టిక్కర్లను అంటించొద్దు అన్నందుకు తమ పార్టీ కార్యకర్తలపై వైసిపి నాయకులు దాడి చేయడం అమానుషమన్నారు. దాడిలో గాయపడి విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించినట్లు తెలిపారు. పార్టీ తరపున ఒక్కొక్కరికీ రూ.50 వేల ఆర్థిక సాయం అందించామని చెప్పారు. స్టిక్కర్లు వద్దనేవారిపై వైసిపి శ్రేణులు దాడులకు దిగుతున్నాయని, ఇదేం పద్ధతని ప్రశ్నించారు.

ఈ సమావేశంలో పార్టీ నాయకులు, పిఎసి సభ్యులు కోన తాతారావు, అధికార ప్రతినిధి సుందరపు విజయ్‌కుమార్, పసుపులేటి ఉషాకిరణ్, పంచకర్ల సందీప్, పివిఎస్‌ఎన్.రాజు, కార్పొరేటర్లు మూర్తి యాదవ్, భీశెట్టి వసంతలక్ష్మి, కందుల నాగరాజు పాల్గొన్నారు.

# దోపిడీ రహిత సమాజం కోసం పునరంకితమవుదాం

**కె. హేమలత**



వందేళ్ల కిందట మన దేశంలో మొట్టమొదటిసారిగా మే డే జరుపుకున్నాం. 1923లో మే డే సందర్భంగా మద్రాస్ మెరీనా బీచ్‌లో కామ్రేడ్ సింగరవేలు ఎర్రజెండా ఆవిష్కరించారు. అయితే నేడు మన కార్మిక వర్గం తిరిగి బ్రిటిష్ వలస పాలన నాటి పరిస్థితులలోకి నెట్టివేయబడుతోంది.

ఎనిమిది గంటల పని, 8 గంటల విశ్రాంతి, 8 గంటల స్వేచ్ఛాధీనం కోసం చేసిన పోరాటానికి చిహ్నం మేడే. కార్మిక వర్గ పోరాటాలు, త్యాగాల ఫలితంగానే 8 గంటల పని విధానం ఏర్పడింది. గరిష్టంగా రోజుకి 8 గంటల పని, వారానికి 48 గంటల పని వుండాలని 1919లో జరిగిన ఐఎల్‌ఓ (అంతర్జాతీయ కార్మిక సంస్థ) మొదటి సమావేశం నిర్ణయించింది. అంతేగాదు, కార్మికులు వర్గపోరాటం ద్వారా మాత్రమే మెరుగైన పని పరిస్థితులను సాధించుకోగలిగారు. సంఘాన్ని ఏర్పాటుచేసుకునే హక్కు, సమ్మె చేసే హక్కు కూడా వారు పొందగలిగారు.

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే 1948లో ఫ్యాక్టరీల చట్టం రూపొందించబడింది. స్వాతంత్ర్య పోరాటంలో చురుగ్గా పాల్గొన్న కార్మికవర్గ ఆకాంక్షలు కొంతమేరకు ప్రతిబింబించేలా పని గంటలకు సంబంధించిన కొన్ని సెక్షన్లను ఈ చట్టంలో పొందుపరిచారు. అయితే, పెట్టుబడిదారుల లాభాల పెంపుకోసం ఏర్పడిన నయా ఉదారవాద పాలనలో పని గంటలను పెంచడం ద్వారా, వారు కష్టపడి సాధించుకున్న హక్కులపై దాడి చేయడం ద్వారా కార్మికులను దోచుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి.

మోడీ ప్రభుత్వం ఆమోదించిన నాలుగు లేబర్ కోడ్లలో ఒకటైన ఉపాధి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులకు సంబంధించిన నిబంధనల విషయమై సంస్థలకు మినహాయింపునిచ్చే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఇస్తున్నది. ఆ వెంటనే పలు రాష్ట్ర ప్రభుత్వాలు పని గంటలను 8 నుంచి 12కు పెంచుతూ ఫ్యాక్టరీ చట్టాన్ని సవరించాయి. అయితే కార్మికుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో వాటిలో కొన్ని రాష్ట్రాలు వెనక్కి తగ్గాయి. ఈ క్రమంలోనే బిజెపి పాలనలో వున్న కర్ణాటక, డిఎంకె నాయకత్వంలోని తమిళనాడు ప్రభుత్వం కార్మికుల పనిగంటలను పెంచేలా ఫ్యాక్టరీల చట్టాన్ని సవరించాయి. కార్మిక సంఘాలతో పాటు పాలక డిఎంకె మిత్రపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించడంతో తమిళనాడు ముఖ్యమంత్రి బిల్లును నిలిపివేస్తున్నట్టు ప్రకటించాల్సి వచ్చింది. కార్మికుడి నుంచి మరింత శ్రమను పిండుకోవాలన్నా, యజమాని లాభాలను మరింత పెంచుకోవాలన్నా పని గంటల పెంపు ముఖ్య సాధనంగా ఉపయోగపడుతుందన్నది తెలిసిన విషయమే.

ద్రవ్యోల్బణం పెరిగిపోతోంటే మరీ ముఖ్యంగా ఆహారం, చమురు ధరలు పెరిగిపోతోంటే...అమెరికా, బ్రిటన్, అనేక యూరోపియన్ యూనియన్ దేశాలలో నిజవేతనాలు పడిపోతున్నాయి. బ్రిటన్‌లో జీవన ప్రమాణాలు 2022లో దారుణంగా పడిపోయాయి. భారత పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2022-23 ఆర్థిక సర్వే ప్రకారం గత రెండేళ్లలో సుమారు 36.5 కోట్ల మంది గ్రామీణ కార్మికుల నిజవేతనాలు స్తబ్ధుగా వున్నాయి. 2014-15 నుంచి 2021-22 మధ్య నిజ వేతనాల వృద్ధి రేటు ఏడాదికి ఒక్క శాతం కంటే తక్కువగా నమోదైంది.

ప్రపంచవ్యాప్తంగా కార్మకవర్గం మేడే జరుపుకుంటున్న ఈ సందర్భంలో...పెట్టుబడిదారీ దేశాలలో 8 గంటల పని దినంతో పాటుగా కష్టపడి సాధించుకున్న హక్కులన్నీ దాడికి గురవుతున్నాయి. వేతనాలు, బోనస్‌లు, పింఛన్లు కోతకు గురవుతున్నాయి. పూర్తి పెన్షన్ పొందేందుకు రిటైర్మెంట్ వయసు పెంచుతున్నారు. కార్మిక సంఘాల హక్కులపై, మరీ ముఖ్యంగా సమ్మె చేసే హక్కుపైన దాడి జరుగుతోంది.

వ్యవస్థాగత సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న పెట్టుబడిదారీ వ్యవస్థ దాని నుంచి బైటపడే పరిష్కార మార్గాన్ని ఇప్పటికీ కనిపెట్టలేకపోయింది. కార్మిక వర్గం, శ్రమ జీవులు సృష్టించిన అపార సంపదను కొన్ని ధనిక దేశాలలో కొద్దిమంది స్వాధీనం చేసుకుంటున్నారు. అపూర్వమైన శాస్త్రసాంకేతిక పురోగతులను ప్రజా ప్రయోజనాల కోసం గాక, బడా కార్పొరేట్లు, బహుళజాతి కంపెనీల లాభాల కోసం వినియోగిస్తున్నారు. 1970లలో పెట్టుబడిదారీ సంక్షోభానికి పరిష్కారంగా తీసుకొచ్చిన నూతన ఆర్థిక విధానం విఫలమైనట్టుగా చాలా చోట్ల అంగీకరిస్తున్నారు. సంపద సృష్టికర్తలైన కార్మికులకు, ఆ సంపదను సొంతం చేసుకొనే బడా పెట్టుబడిదారులకు మధ్య తీవ్రమౌతున్న వైరుధ్యాలకు పరిష్కారాన్ని కనుగొనలేకపోతున్నట్లు పెట్టుబడిదారీ విధానం గ్రహించింది.

ఈ తీవ్ర వైరుధ్యాలు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అన్ని రకాల భారీ పోరాటాలలోనూ కనిపిస్తున్నాయి. రవాణా కార్మికులు, రైల్వే కార్మికులు, నర్సులు, డాక్టర్లతో సహా ఇతర ఆరోగ్య రంగ కార్మికులు, టీచర్లు, లెక్చరర్లు, విద్యారంగ ఉద్యోగులు, రిటైల్ రంగ కార్మికులు, ప్రభుత్వ రంగ ఉద్యోగులు, ఆటోమొబైల్ కార్మికులు, అమెజాన్, గూగుల్, స్టార్‌బక్స్ కార్మికులు, గిగ్ వర్కర్లు తదితరులు అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, గ్రీస్...ఇతర అనేక దేశాలలో మునుపెన్నడూ లేని విధంగా సుదీర్ఘ సమ్మెలకు, అపూర్వమైన పోరాటాలకు దిగుతున్నారు.

మన దేశానికి వచ్చేసరికి 2022 మార్చిలో పది కేంద్ర కార్మిక సంఘాలు ఐక్య వేదికను ఏర్పాటు చేసుకుని రెండు రోజుల పాటు సమ్మె చేశాయి. ఇదిగాక బొగ్గు కార్మికులు, విద్యుత్, స్టీల్, బ్యాంకు, బీమా, స్కీమ్ వర్కర్లు, ప్రభుత్వ ఉద్యోగులు రంగాల వారీగా పోరాటాలు చేపడుతున్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగాను, ఇతర డిమాండ్ల సాధన కోసం సమ్మెలు చేస్తున్నారు. ఈ పోరాటాల ధాటికి నూతన ఆర్థిక విధానాలు కొంత మేరకు వెనకపట్టు పట్టాయి. లేబర్‌కోడ్లు పార్లమెంట్‌లో పాసై మూడు సంవత్సరాలైనప్పటికీ వాటిని ప్రకటించలేకపోయింది. స్కీమ్ వర్కర్లు పోరాటాల ద్వారా వేతనం, ఇతర బెనిఫిట్లను సాధించుకోగలిగారు. పేదలకు, మరీ ముఖ్యంగా మహిళలు పిల్లలకు సేవ చేసే ఈ పథకాలను ప్రైవేటీకరించకుండా, నిర్వీర్యం చేయకుండా అడ్డుకోగలిగారు. సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వాన రైతాంగం చేపట్టిన చారిత్రిక పోరాటంతో మోడీ ప్రభుత్వం దిగివచ్చి మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాల్సి వచ్చింది.

సంపద సృష్టికర్తలైన కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు తమ ఉమ్మడి సమస్యలపై పోరాడేందుకు కలిసికట్టుగా ముందుకొస్తున్నారు. నేడు కేంద్రంలో అధికారంలో వున్న మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం దూకుడుగా అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలే వారి సమస్యలకు మూల కారణం. అందుకే వీటికి వ్యతిరేకంగా సిఐటియు, ఎఐకెఎస్, ఎఐడబ్ల్యుయు ఏప్రిల్ ఐదవ తేదీన భారీ మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీని నిర్వహించాయి.

అయితే, మన దేశంతోపాటు ప్రపంచ స్థాయి అనుభవాలను చూసినట్లయితే కేవలం పోరాటాలే సరిపోవు. నాయకత్వానికి నయా ఉదారవాద విధానాల పట్ల స్పష్టమైన ప్రత్యామ్నాయ దృక్పథం లేకపోవడాన్ని...దోపిడీ పెట్టుబడిదారీ వ్యవస్థకు చెందిన మితవాద శక్తులు అవకాశంగా తీసుకుని ప్రజల్లో వున్న అసంతృప్తి నుంచి ప్రయోజనం పొందుతున్నాయి. ఫ్రాన్స్, ఇటలీ, హంగేరి, పోలాండ్, నెదర్లాండ్స్...వంటి అనేక యూరోపియన్ దేశాలలోను, అమెరికాలోను ఇదే విధంగా జరిగింది. మన దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోని మతతత్వ విభజన శక్తులు లాభం పొందుతున్నాయి. మితవాద శక్తులు ఉదారవాదాన్ని వ్యతిరేకించకుండా...కులం, మతం, జాతి, భాష పేరిట శ్రామికుల మధ్య చిచ్చు పెట్టి ఐక్య పోరాటాలను బలహీన పరుస్తున్నాయి.

భారత దేశంలో మనం చూస్తున్నట్టుగా పాలక వర్గాలు మితవాద శక్తులకు మద్దతునిస్తున్నాయి. అపఖ్యాతి పాలైన ఉదారవాదానికి స్పష్టమైన ప్రజానుకూల ప్రత్యామ్నాయాన్ని కలిగివున్న వామపక్షాలు పోరాటాల్లో గెలుపొందకూడదన్నదే వాటి లక్ష్యంగా వుంది. అందుకే, తమ తక్షణ సమస్యలైన పని గంటలు, వేతనాలు, సాంఘిక భద్రత, పని ప్రాంత హక్కులు వంటి వాటికి...ఈ విధానాలను పెంచి పోషించే నయా ఉదారవాద రాజకీయాలకు మధ్య గల సంబంధాన్ని కార్మికులకు, ప్రజలకు తెలియచేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. కార్మిక వర్గానికి, శ్రమజీవులకు తమ తక్షణ శత్రువు ఎవరో మిత్రుడు ఎవరో తెలుసుకునేలా చేయాలి. వారి అసలు శత్రువులైన నయా ఉదారవాద విధానాలకు, దోపిడీ పెట్టుబడిదారీ వ్యవస్థకు, పాలక- కాషాయ-కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరు సల్పేలా దిశానిర్దేశం చేయాలి. దోపిడీ రహిత సమాజాన్ని సాధించుకునే దిశగా కదలాలి.

కష్టపడి సాధించుకున్న హక్కులను కాపాడుకోవడానికి మాత్రమే కాకుండా...పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి మొత్తం సమాజాన్ని విముక్తి చేయడం కోసం పునరంకితమవుదాం. 2023 మేడే నాడు మనం చేస్తున్న ప్రతిజ్ఞ ఇది.

**( వ్యాసకర్త సిఐటియు జాతీయ అధ్యక్షురాలు )**

# అక్షరం

ప్రజాశక్తి

www.prajasakti.com

facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 1 మే 2023


"మార్క్సిజం దృష్టితో రాశాను
కాబట్టి- ఇది మహాకావ్యం అని రచయత
అనుకుంటే- అది నిజం కాకపోవొచ్చు.
మార్క్సిజం మన ఆలోచనలకు,
అవగాహనకూ ఓ మార్గదర్శి. దానిని చుట్టూ
వున్న సమాజానికి, పరిస్థితులకు అన్వయించి,
రచయిత సృజనాత్మకంగా రాయాలి.
అప్పుడే అది మంచి రచన అవుతుంది."

– మహాకవి శ్రీశ్రీ





## ఎనిమిది గంటలు

శ్రమ దోపిడీ కూకటి వేళ్లను
తెగ నరికిన హక్కుల ఖడ్గం
అలుపెరగని స్వేదపు ఘోషను
నినదించిన శ్రమైక వర్గం
బాధ్యతల బతుకు పోరును
రగిలించిన సమైక్య నినాదం
ఆశయాల ఆర్తి గీతమును
ఎగరేసిన అరుణ పతాకం

అడుగడుగున పిడికిలి ఎత్తి
ఆకాశాన గొంతును ఎత్తి
గడగడలాడించిన కార్మిక కత్తి
ప్రభవించిన విప్లవ శక్తి
చికాగోలో శివమెత్తిన చిత్రం
ప్రపంచాన పరిచిన విచిత్రం
చిందించిన రక్తపుటేరులు
మండించెను మహోజ్వల పోరులు

ఆగని గొడవల రక్త తర్పణం
చాకిరీ విముక్తికి ప్రాణలర్పణం
చైతన్య బావుటా ఎగిరిన కోట
ఎనిమిది గంటల పనుల పాట
వెల్లి విరిసిన చెమట చుక్కలు
కొత్త వెలుగులై చిమ్మిన దిక్కులు
కలుపు మొక్కలను నరికిన కొడవలి
మేడే హక్కుల సమిష్టి పిడికిలి...

జగతి శాంతి కపోతమై
ప్రగతి కాంతి పతాకమై
రెపరెపలాడిన దీప్తి కేతనం
బిరబిర ప్రవాహ స్ఫూర్తి చేతనం
జయ జయహో శ్రామిక విప్లవ శక్తి
జయ జయహో శ్రమైక పరిప్లవ యుక్తి..!

– డాక్టర్ కటుకోఝ్వల రమేష్
99490 83327

## మేడే పాట

**పల్లవి :**
పేదల గుడిసెలపై ఎగిరే జెండమ్మా
బీదల బతుకులనే మార్చే పతాకమా
కూలీ నాలి పేదా రోదా
గుండె గుండెలో నీవమ్మా
ఓ... ఎర్రని జెండమ్మా
మా పేదల బతుకమ్మ... 2

**చరణం 1 :**
కార్మిక, కర్షక పోరాటాలకు
అండే నీవమ్మా..
కూడు గూడుకి జరిగే పోరులో
తోడున్నా వమ్మా ...
మా ఎర్రని జెండమ్మా .. మాపేదల బతుకమ్మా – 2

**చరణం 2 :**
మహిళలు మాన ప్రాణాలకు
రక్షణ నీవమ్మా
నిరుద్యోగుల ఉపాధి పోరులో
ముందున్నావమ్మా
మా ఎర్రని జెండమ్మా
మా బతుకుల తోడమ్మా ... 2

**చరణం 3 :**
విద్యా, ఉద్యోగ, ఉపాధ్యాయల
ఊపిరి నీవమ్మా
శ్రామిక జన బాంధవివై
ఎగిరే జెండమ్మా ..
మా ఎర్రని జెండమ్మా
మా ప్రాణం నీవమ్మా – 2

**చరణం 4 ::**
ప్రపంచ కార్మిక ఐక్యత కోసం
పరితపించినావే
దోపిడీ లేని రాజ్యం కోసం
పోరు సలిపినావే...
ఓ... ఓ... ఓ ...
**ఎగిరే పతాకమా**
**మా ఎర్రని జెండమ్మా... 2**

– రెడ్డి శంకరరావు
94943 33511

## మేడే

శ్రమను
చెమట చుక్క మింగేస్తుంది
రాలిన చుక్క గ్లోబల్ వార్మింగ్‌తో
కానరాట్లేదు
శ్రమను యంత్రం దోచేస్తుంది
యంత్రానికి సాంకేతికత తోడై
తోడేస్తుంది స్వేదాన్ని


శ్రమను
మెదడు కబళించేస్తుంది
శ్రమ
గంటల లెక్క మరిచింది
శ్రమ
ఆరంభం ముగింపులను బంధించింది

కానరాని
కానొచ్చే శ్రమలిప్పుడు
కాసులు లేవు
బెదిరింపులు అదిరింపుల లొల్లి
హక్కులే మరిచిన శ్రమ
నేలను గొడ్రాలిని చేసి
మనిషిని నిర్వీర్యుడిని చేసి
గాలిని అమ్మకంలో పెట్టిన పెట్టుబడి!
నీరునూ కొనే తంత్రంలోకి
పాచికలు వేసిన పెట్టుబడి
తనను తానే మింగుకునే తాచుపాము అవుతుంది
ఆలోచిస్తే మనిషి దాని గుట్టు తెలుస్తుంది

కానీ, మేడే అంటే
అదో సెలవుదినమనే తరం
కొన్నాళ్ళాగితే వెట్టిలో మగ్గే
మరుగుజ్జు తరం సాక్షాత్కారం!

– గిరి ప్రసాద్ చెలమల్లు
94933 88201

# తెలుగు నాటక రంగంపై విజ్ఞాన భాండాగారం




తెలుగు నాటక రంగంపై ఇది ఒక విజ్ఞాన సర్వస్వం. విజ్ఞాన భాండాగారం. చరిత్ర, రంగస్థలం అభిమానులు, పరిశోధకులు, భాషాభిమానులు పది కాలాల పాటు దాచుకోదగ్గ అమూల్య గ్రంథం. 'తెలుగు నాటక రంగ మూల స్తంభాలు' పేరిట ప్రచురించిన ఈ బృహత్ గ్రంథం తెలుగు నాటక రంగ సమాచారాన్ని ఇచ్చే గ్రంథమే కాదు; గ్రంథాలయాలు.. ముఖ్యంగా విశ్వవిద్యాలయ గ్రంథాలయాలు తెలుగు అధ్యయన విభాగాలు సేకరించి పెట్టుకోదగ్గ సమాచార ఖని. దీని వ్యాసకర్తలు ఏడు పదుల తమ జీవితంలో, అత్యధిక కాలం నాటకరంగంతో ఎన్నో విధాల సంబంధం కలిగి, దాన్ని కొనసాగిస్తున్న వారు. అధ్యాపకత్వంతో పాటు పలు జాతీయ, అంతర్జాతీయ సెమినార్లలో, వెబినార్లలో పాల్గొని పరిశోధక పత్రాలు సమర్పించిన వారు. ఒక అకడమిక్ అసైన్మెంట్ లాగానో, సరదాగా అప్పుడప్పుడు రాస్తూ వచ్చిన వ్యాసాల సంపుటీకరణో కాదు ఇది. ఒక నిబద్ధత, కచ్చితత్వం కోసం రోజులు, దూరాలు అధిగమించి వ్యక్తులు, కుటుంబాలు, సంస్థలు, పరిశోధనాలయాలను సందర్శించి, ప్రామాణికంగా రూపుదిద్దిన గ్రంథం ఇది. డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు, వాడ్రేవు సుందరరావు ఈ వ్యాస సంపుటి రచయితలు. 900 పేజీలకు పైబడిన సైజులో ప్రతి ఒక్క రంగస్థల తేజోమూర్తి ఛాయాచిత్రాన్ని పొందుపరుస్తూ, సాగిన గ్రంథం ఇది. తెలుగు రంగస్థలం ప్రారంభ కాలం నుంచి నిన్న మొన్నటి వరకు మన మధ్యలోనే జీవించి, జీవితపు రంగస్థల వేదిక నుంచి దిగిపోయిన వారి జీవితాల్లోని వెలుగునీడలను, ప్రభవించి అస్తమించిన రంగమార్తాండుల, నాటక రంగ కులదీపకులు, మణిదీపాలు అయిన వారి జీవిత చరిత్రను అక్షర చిత్రలేఖనా సమ రచన ఇది.

తెలుగు సాహిత్య, సాంస్కృతిక, నాటకరంగాలకి నిస్వార్థ శ్రేయోకాంక్షతో, పాతికేళ్ల పైబడి పనిచేస్తున్న సంస్థ అజో–విభో–కందాళం ఫౌండేషన్. ఇప్పటికే పలు సాహిత్య విలువలతో కూడిన గ్రంథాలను సముచిత ధరలకే అందిస్తూ సాహితీ సేవ చేస్తోంది. ఇప్పుడు ఈ గ్రంధాన్ని వెలువరించింది. ఇందులో మొదటి భాగం నాటక రచయితలు... తొలి తెలుగు నాటక రచయిత కోరాడ రామచంద్ర శాస్త్రి గారితో మొదలుపెట్టి, గంధం నాగరాజు వరకు మొత్తం 116 మంది రచయితల గురించిన వ్యాసాలున్నాయి. రెండోభాగంలో నటులు దర్శకులు, శీర్షికన సురభి పాపా బాయ్‌తో మొదలుపెట్టి డిఎస్ దీక్షిత్ వరకు 13 మంది నట దర్శకుల గురించిన, సాంకేతిక నిపుణులు శీర్షికన పాపట్ల లక్ష్మీకాంతయ్య (సంగీతం) హెద్ది శర్మ (దృశ్య బంధ నిర్మాణం) సాదినేని అంజిబాబు (ఆహార్యం), రామమూర్తి (రంగోద్దీపనం), అడబాల (ముఖసజ్జా నిపుణులు) మొత్తం ఐదుగురిని, నిర్వాహకులు శీర్షికన ఆంధ్ర నాటక రంగ కళోద్ధారకులు వనారస గోవిందరావుతో మొదలుకొని పంతం పద్మనాభం వరకు పది మంది, 'పరిశోధకులు' శీర్షికన తెలుగు నాటక విజ్ఞాన సర్వస్వం శ్రీనివాస చక్రవర్తి, తెలుగు నాటక పరిశోధనా పితామహుడు డాక్టర్ పిఎస్ఆర్ అప్పారావు గురించి, ఇతర ప్రక్రియలు శీర్షికన డాక్టర్ ఫన్ చంద్రశేఖరం (బహుకృతవేషం), డాక్టర్ ధారా రామనాథ శాస్త్రి (నాట్యవధానం), డాక్టర్ నేరేళ్ల వేణుమాధవ్ (ధ్వన్యనుకరణ) గురించిన విలువైన వ్యాసాలు ఉన్నాయి.

ఈ గ్రంథంలో ప్రకాశకుల 'మనవి మాటలు' శీర్షికన ఆచార్య అప్పాజోశ్యుల సత్యనారాయణ 'ఈ గ్రంథం 234 మంది తెలుగు రంగభూమి సేవా పరాయణులై, కీర్తిశేషులైన కళాకారుల సంక్షిప్త సమాచార సమాహారం. ఈ గ్రంథం భావితరాల్లో తెలుగు నాటక సాహిత్య చరిత్రలో, సముచిత స్థానాన్ని సంపాదించి, నాటక ప్రియులకు చరిత్రకారులకు పరిశోధకులకు కరదీపిక కాగలదని నా ప్రగాఢ విశ్వాసం. ఈ పుస్తకాన్ని ప్రచురించే అవకాశం కలగడం మా సుకృత విశేషం' అనడం వారి ఔన్నత్యం. 'జీవితమే రచనకు పునాది' అన్న ముందు మాటలో డాక్టర్ దీర్ఘాసి విజయ భాస్కర్ 'పౌరాణిక ఇతివృత్తాలు పాగా వేసినప్పుడు పద్యం రాజ్యమేలింది. అయితే సమకాలీన సమస్యల ఆవిష్కరణ, పరిష్కార మార్గాల అన్వేషణ ప్రధాన లక్ష్యం అయినప్పుడు– ఆధునిక నాటకం తెలుగు రంగస్థలంపై వేళ్ళూనుకొన్నది' అంటారు. డార్విన్ పరిణామ సిద్ధాంతం ఫ్రాయిడ్ మనో విశ్లేషణ, కార్ల్ మార్క్స్ గతి తార్కిక భౌతిక వాదం, ఆధునిక ప్రపంచ సాహిత్యాన్ని ప్రభావితం చేశాయి. రచయిత తాననుభవించిన సంఘర్షణకు ప్రతిరూపమే అతను సృష్టించిన సాహిత్యం. స్థూలంగా విశ్వనాథ వారు .. మనుషులు, వారిలోని వికారము, వారి కామ క్రోధ మాత్సర్యాది దుర్గుణ జన్యములైన కార్యములు– పాశ్చాత్యుల నాటకాల్లో ప్రతిబింబిస్తే, సంస్కృత నాటక కవులు లోకమందలి అల్ప మానవ ప్రకృతుల చిత్రించుట వదిలిపెట్టి ఉదాత్త ప్రవృత్తులను, వారు మహాశిల్పులు గనక ఆ ఉదాత్తత యందు రమణీయ ప్రవృత్తులను చిత్రించారని స్పష్టపరిచారు

సాంస్కృతిక పునరుజ్జీవన రథసారథులుగా గురజాడ కందుకూరి, పానుగంటి, చిలకమర్తి, కాళ్లకూరి లాంటి సంస్కరణ వాదులు తమ కలాలని ఝుళిపించారు. పౌరాణిక వ్యవస్థ లౌకిక జ్ఞానాన్ని గ్రహణం పట్టించడం వంటి దుర్గుణాలపై కీర్తిశేషులు త్రిపురనేని, నార్ల, చలం లాంటి కవుల కలాలు సమర శంఖారావం చేశాయి. జాతీయ ఉద్యమం సంస్కరణ ఉద్యమం రెండు పెనవేసుకుంటూ తెలుగు నాటక సాహిత్యంలో ముందుకు సాగాయి.

ఒక సమస్యను కవిత్వం ముందుగా ఆవిష్కరించినా, పరిష్కారాన్ని సూచించడంలో నాటకం ముందుంటుంది. మాభూమి వంటి నాటకాలతో ప్రారంభమైన నాటక ఇతివృత్త ప్రజాస్వామీకరణ జోరుగా ఊపందుకుంది. నాటకానికి సంఘర్షణ ప్రాణం. ఈ ఘర్షణ బహిరంగంగాను, అంతర్గతంగాను ఉంటుంది కనుక మనో విశ్లేషణ పేరుతో తెలుగు నాటక సాహిత్యంలో మానవ మనోలోకాల్లో జరిగే అంత: సంఘర్షణను ఆవిష్కరించే ప్రయత్నం చేసింది. ఆత్రేయతో ప్రారంభమైన మధ్య తరగతి జీవన చిత్రం ముందుకు సాగుతోంది. ప్రపంచీకరణ సాంకేతిక సమాచార మాధ్యమాలు శరవేగంతో సామాన్య ప్రజల వినియోగంలోకి రావడం వల్ల విదేశీయమైన ప్రతి మార్పు భారతదేశంలో ప్రతిధ్వనిస్తోంది. నాటకానికి సరైన వేదికలు కరువైన తెలుగు రాష్ట్రాల్లో పరిషత్తులే వేదికలై నాటకాన్ని బతికిస్తూ, మెలో డ్రామాను కూడా పెంచి పోషిస్తున్నాయి. 20వ శతాబ్దం మధ్య నుంచి వచ్చిన ఆధునికోత్తర సాహిత్యం– వస్తుపరంగా ప్రయోగపరంగా డ్రాయింగ్ రూమ్ నుంచి బయటపడి దృశ్యాల్ని, ప్రదేశాల్ని, సంఘటనలను సింబాలిక్‌గా ప్రదర్శించడం, వ్యంగ్యంగాను అన్యాపదేశంగా విషయాల్ని ప్రస్తావించడం, జానపద కళారూపాల ద్వారా సోషియో ఫాంటసీ ద్వారా, నాటకాలు నడిపించడం, ఆధునిక సాంకేతిక సాధనాలైన లైటింగ్ ఎక్విప్మెంట్ మరింత ప్రతిభావంతంగా వినియోగించడంతో రంగస్థలం అత్యాధునిక నాటక లక్షణాలుగా సంతరించుకుంది.


ఏ రచయితను ఏ తాత్విక సిద్ధాంతాలు ప్రభావితం చేశాయో, ఏ సామాజిక స్థితిగతులు తనదైన శైలిని వస్తువును పరిష్కారాన్ని పంచుకునే దిశగా ప్రేరేపించాయో, తనలోని అంతశ్చేతనను ఏ దిశగా నిర్దేశనం చేశాయో, ఏ గడ్డు పరిస్థితిలో అతనిలో నిద్రాణమైన సృజనాత్మక శక్తుల్ని వెలికితీశాయో, సాధికారికంగా సోదాహరణంగా వివరంగా వెల్లడించారన్న సంతృప్తిని కనపరిచారు.

ఒక రచన చదివితే రచయిత ఏమి ఆశించాడో తెలుస్తుంది అతడి జీవితాన్ని చదివితే అతని ఏమి శ్వాసించాడో అర్థమవుతుంది. ఈ రెండూ సమన్వయం చేసుకుంటూ మన తెలుగు నాటక కవులు, రచయితలు ఏమి సాధించారో తెలియాలంటే ఈ గ్రంథం చదవాల్సిందేనన్న డాక్టర్ విజయభాస్కర్ అభిప్రాయంతో నూటికి నూరు శాతం ఏకీభవిస్తాం. 160 ఏళ్ల తెలుగు నాటక రంగ చరిత్రలో ఇలాంటి గ్రంథం ఒకటి రావడం ఇదే మొదటిది అని చెప్పుకోవచ్చు. ఇటువంటిది మరో వందేళ్ళకు కూడా రెఫరెన్స్ గ్రంథంగా పనికొస్తుందనడంలో సందేహం లేదు. ఇద్దరు వ్యాసకర్తలు దాదాపు 240 మందికి సంబంధించిన సమాచారం సేకరించాలని ఒక అవగాహన కొచ్చి తమ అనుకూలత, అభిరుచి, అందుబాటులో ఉండగల సమాచారాన్ని అంచనా వేసుకుని ఇష్టపూర్తిగా ఒక ఐదేళ్లపాటు శ్రమించి, అభిమానించి ఆత్రుత పడి ఆవేదన పొందడం లాంటి భావోద్వేగాల మధ్య.. అనుకున్న ఫోటోనో, పుస్తకాలో, వ్యక్తుల సమాచారమో దొరకని సందర్భంలో మథన పడి వేదనకు గురైన సందర్భాలు అనేకం ఉన్నట్లు పాఠకులకు అర్థమవుతుంది. సమాచార ప్రామాణికతకు పెద్దపీట వేస్తూ, రాష్ట్రంలో దేశంలోని ఇతర ప్రాంతాల్లోని వ్యక్తులు, సంస్థలు, గ్రంథాలయాలను పట్టుదలతో శోధించి సేకరించిన సమాచార సముద్రం ఈ గ్రంథం.

'గాంధీ విజయం' వంటి నాటకం రాసినందుకు దామరాజు పుండరీకాక్షుడు జైలు శిక్షను అనుభవిస్తూ, అదే జైలులో అదే నాటకాన్ని ప్రదర్శిస్తే.. ఖైదీలు, జైలు సిబ్బంది కలిసి తెల్లవారులు చూసి, స్వాతంత్ర్యం సాధించి తీరాలన్న సంకల్పం మరింతగా దృఢపడ్డ సందర్భాన్ని అక్షరబద్ధం చేస్తూ, వ్యాసకర్తలు అనుభవించిన ఆనందోద్వేగాలు పాఠకుల్ని చుట్టుముడతాయి. వేటపాలెంలోని సారస్వత నికేతనంతో పాటు భారత ప్రభుత్వ 'డిజిటల్ ఇండియా లైబ్రరీ' వీరి కృషికి ఉపయోగపడిన సమాచార కల్పతరువు. పిఎస్ఆర్ అప్పారావు, మిక్కిలినేని తరువాత తెలుగు నాటక రంగ నటరత్నాలను కాల చరిత్ర నుంచి తవ్వి వెలికి తీసి దాని బృహదాకారాన్ని కళ్ళరా చూసుకున్న ధన్యులు ఈ వ్యాసకర్తలు. పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటక రచయితలు, నటులు, దర్శకులు, సమాజాలు సాంకేతిక వర్గం ఇలా విభజించుకుని అహరహం తపించి పూర్తి చేసిన యజ్ఞసమ దీక్షా ఫలితంగా కనిపిస్తుంది ఈ గ్రంథం. గుంటూరు 'సంస్కృతి' బాలచందర్ గారి ఆమోదంతో రంగస్థల నటుల గురించి ఒక పుస్తకం రాయాలి, రాద్దామనుకుని ఆ పుస్తకం రాసి, అటుపై రచయితలు దర్శకులు, సంగీత కళాకారులు సాంకేతిక నిపుణులు, సమాజ నిర్వాహకులు, పరిశోధకులు' సమాచారంతో మరొక పుస్తకం తీసుకురావాలనుకున్నప్పుడు, అజోవిభోకందాళం ఫౌండేషన్ వారు ముందుకు వచ్చి వ్యాసకర్తల కలల సాకార రూపంగా ఈ గ్రంథాన్ని ప్రచురించి, భౌతికంగా మన ముందు ఉంచడం ఎంతైనా అభినందనీయం.

– మల్లేశ్వరరావు ఆకుల
79818 72655

# నాట్యశిఖామణి నటరాజ రామకృష్ణ



పద్మశ్రీ నటరాజ రామకృష్ణ 1933లో ఇండోనేషియాలో గల కలల దీవిలో ఒక సంపన్న ప్రవాసాంధ్ర కుటుంబంలో 1928 మార్చి 21న జన్మించారు. ఆయన పూర్వీకులది తూర్పు గోదావరి జిల్లా రాజోలు, అమ్మమ్మ ఊరు నల్లగొండ జిల్లాలో ఒక గ్రామం. తండ్రి రాంమోహన్ రావు, తల్లి సమయం మంచి వీణా విద్వాంసురాలు. ఆమెకు అనేక కళల్లోనూ పరిచయం ఉండేది. రామకృష్ణకు మూడేళ్ల వయసులోనే తల్లి మరణించారు. దీంతో రామకృష్ణను మద్రాసులోని రామకృష్ణ మిషను చదువు నిమిత్తం పంపించారు. నృత్యంపై బాల్యం నుంచి మక్కువ ఎక్కువ, కాని వారి తండ్రికి నచ్చేది కాదు. ఆ రోజుల్లో సమాజంలో నాట్యకళను నిషేధించారు. కాని నటరాజ రామకృష్ణ గారికి నాట్యం అంటే ఎనలేని ప్రేమ. కళ కోసం కుటుంబాన్ని, ఆస్తిని కూడా విడిచిపెట్టారు. వారు పేదరికం వల్ల కళ కోసం తపనతో ఎన్నో ఇబ్బందులు అలాగే ఒడిదుడుకులకు గురికావాల్సి వచ్చింది.

నాట్యం పట్ల తన అంతర్గత కోరికను నెరవేర్చుకోవడానికి రామకృష్ణ మీనాక్షి సుందరం పిళ్లై, వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి, నాయుడుపేట రాజమ్మ, పెండ్యాల సత్యభామ వంటి గొప్ప గురువుల వద్ద శిష్యరికం చేసి వివిధ నాట్య రీతులు నేర్చుకున్నారు. రామకృష్ణ అన్నయ్య శ్యామసుందరుడే తన నాట్య గురువు. ఒకరోజు నాగ్‌పూర్‌లో నృత్య ప్రదర్శనను చూసి బండార రాజుకు రామకృష్ణ గారిని డాక్టర్ సోనక్ వర్తమాన నర్తకుడిగా పరిచయం చేశారు. నాగ్‌పూర్‌లోని ప్రముఖులతో కూడిన రాజసభ ముందు రామకృష్ణ తన అసమానమైన ప్రదర్శనతో వాళ్ళను మంత్రముగ్ధులను చేశారు. ఈ ప్రదర్శన ఆయన జీవితంలో నిజమైన మలుపు.

రామకృష్ణ నాట్యశాస్త్రంలో నిరంతర అధ్యయనం ద్వారా తన మనోధర్మాన్ని అభివృద్ధి చేసుకున్నారు. మరాఠీ, హిందీ భాషల్లో నృత్యంపై అతని వాగ్ధాటి ప్రేక్షకులను ఆకట్టుకునేది. రామకృష్ణ సరస్వతీ మహల్ గ్రంథాలయంలో దొరికిన సంగీతం, నృత్యానికి సంబంధించిన పాత రాతప్రతులను అధ్యయనం చేసిన అపర పరిశోధకుడు. 'జాయప సేనాని' రాసిన 'నృత్య రత్నావళి'ని పరిశోధించి, 'రామప్ప'లోని మృదంగ భంగిమల్ని పరిశీలించారు. ప్రతి శబ్దానికి ఉత్పత్తి, పరాకాష్ట, అంతర్ధానం అనే మూడు దశలుంటాయని, ఆ నాధోత్పత్తి, విజృంభణ నిశ్శబ్దతలను గురించి వివరంగా తెలిసి ఉన్న నర్తకుడు ఏ రూపాన్నైనా సృష్టించగలడని నటరాజ రామకృష్ణ 'పేరిణి' నృత్యానికొక సజీవ రూపకల్పన చేసి మన ముందుంచారు. 10వ శతాబ్దానికి చెందిన కాకతీయ రాజవంశం యొక్క నృత్య సంప్రదాయమైన 'పేరిణి' అని పిలువబడే దీర్ఘకాలంగా మరచిపోయిన పోరాట కళను పునర్నిర్మించారు. దీన్నే 'పేరిణి శివతాండవం' అని కూడా పిలుస్తారు. ఇది ఇప్పుడు యువతలో బాగా ప్రాచుర్యం పొందింది.

బౌద్ధ కాలం నుంచి ప్రాచుర్యంలో ఉన్న నృత్య రీతి ఆంధ్రనాట్యాన్ని ఆయన పునరుద్ధరించారు. ఈ నృత్యాన్ని వ్యవహారంలో కచేరీ, కేళిక దర్బారు, మేజువాణి మొదలైన పేర్లతో పిలిచేవారు. నృత్యం, అభినయం రెండూ ఈ ప్రాచీన నృత్యంలో కనిపిస్తాయి. ఈ నాట్యంలో ముఖ్యంగా చెప్పుకోవాల్సినవి భామా కలాపం, గొల్ల కలాపం. నిద్రాణ స్థితిలో ఉన్న ఈ కళను (పేరిణి,ఆంధ్ర నాట్యాన్ని) అభివృద్ధి చేశారు. మన రిపబ్లిక్ వేడుకల్లో, అప్పా ఉత్సవంలో చిందు యక్ష గానం ప్రదర్శితం కావటానికి నటరాజ రామకృష్ణ కృషి ఉంది. తెలంగాణ పల్లెల్లో దళిత జీవనంలో సజీవంగా ఉన్న ప్రాచీన చిందు యక్షగానాన్ని ప్రాచుర్యంలోకి తేవటానికి నటరాజ అవిరళ కృషి చేశారు. వివిధ జిల్లాల్లో 20 వేల మంది కళాకారులున్నారని లోకానికి చాటారు. శ్రీకాకుళం–విజయనగరం ప్రాంతపు తప్పెటగుళ్ళు, ఉభయ గోదావరి జిల్లాల వీరనాట్యం, గరగలు ప్రాచుర్యంలోకి రావటంలో కూడా రామకృష్ణ కృషి ఉంది. దొమ్మరులు శరీర విన్యాసాల విశిష్టతలను ఆయన అక్షరబద్ధం చేశారు. శివపార్వతులను గానం చేసే గురవయ్యలు, ఉరుములు తెగలవారిని 18 రోజుల్లో 18 పర్వాల మహాభారతాన్ని ప్రదర్శించే చిత్తూరు జిల్లా వీధిభాగవతులైన కొట్టండ్లు గురించి, కూచిపూడి భాగవతుల గురించి అధ్యయనం చేశారు.

1955లో బాలబాలికలకు నృత్యంలో శిక్షణ ఇవ్వడానికి ఈ కళను ప్రచారం చేయడానికి హైదరాబాదులో నృత్యనికేతన్‌ని స్థాపించి అనేకమంది కళా శిష్యులను తయారు చేశారు. రాష్ట్రంలో నాట్యకళకు సేవలందిస్తున్న అనేక సాంస్కృతిక సంస్థలు వారి ప్రోత్సాహాన్ని పొందాయి. కేంద్ర సంగీత అకాడమీ కూచిపూడి నాట్యాన్ని సాంప్రదాయ కళారూపంగా గుర్తించడానికి నిరాకరించింది. దీంతో నటరాజ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో కన్వీనర్‌గా ఒక సదస్సు నిర్వహించారు. దేవదాసి కళాకారులతో 'అభినయ' అనే సంస్థను నెలకొల్పారు. 1972లో రాజమండ్రిలో ఒక సెమినారు నిర్వహించి రెండు వేల ఏళ్ల చరిత్ర ఆలయ నృత్యాలపై సిలబస్ రాయించారు. ఈ ప్రయత్నమే తర్వాత కాలంలో ఆంధ్రనాట్యంగా ఫలవంతమైంది. తూర్పు తీర ప్రాంతాల్లో ప్రాచుర్యంలో ఉన్న 'తూర్పు భాగవతం' తెలుగు వారందరికీ తెలిసేలా అకాడమీ ద్వారా ప్రోత్సాహాన్నిచ్చారు. వృద్ధ దేవదాసీలకు 'అమ్మా' అంటూ నటరాజ ఆత్మీయంగా ఆదరించారు.

నటరాజ రామకృష్ణ 15 ఏళ్ల వయసులోనే ఆంధ్రప్రభలో 'నత్యాంజలి' శీర్షికతో అనేక వ్యాసాలు రాశారు. తర్వాత వాటిని పుస్తక రూపంలో తీసుకొచ్చారు. ఇతర పత్రికల్లోనూ ఆయన వ్యాసాలు ప్రచురితమయ్యాయి. 41 పుస్తకాలను రాశారు. ఆయన రాసిన ఆరు పుస్తకాలు రాష్ట్ర కేంద్ర అవార్డులను గెలుచుకున్నాయి. భారతీయ నృత్యం సారాంశం, 'ఆత్మ' సందేశం అయిన 'అభినయ'ని వారు ప్రచారం చేశారు. నటరాజు కన్వీనర్‌గా రాష్ట్ర సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించి శాస్త్రీయ కళారూపంగా ఆమోదం పొందేలా చేసి కూచిపూడి నృత్య గత వైభవాన్ని పునరుద్ధరించారు. కూచిపూడి అభివృద్ధి, ప్రచారం కోసం వారు అనేక పద్ధతులను సూచించారు. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో తూర్పు భాగవతంపై మరింత ప్రాచుర్యం తెచ్చి పేద కళాకారులను ప్రోత్సహించేందుకు సదస్సు నిర్వహించారు. నృత్యంపై పురాతన రాతప్రతులను సేకరించి భారతీయ నాట్యకళకు ఆత్మ అయిన సాత్వికాభినయాన్ని అభ్యసించిన కళాకారుడు నటరాజ రామకృష్ణ. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఇంకా అనేక సత్కారాలు సన్మానాలు బిరుదులు పొందారు. తన నృత్యకళకే అంకితం చేసిన కళాజీవి నటరాజ రామకృష్ణ.

– రేగుళ్ళ మల్లికార్జునరావు,
సంచాలకులు, భాషా సాంస్కృతిక శాఖ,
ఆంధ్రప్రదేశ్, 94916 59899

## సలాం కార్మికా ...

భూగర్భంలో పొంచి ఉన్న
ప్రమాదపు
అంచున మసిబారిన ముఖంతో
సేవలందించెను
సింగరేణి బొగ్గు కార్మికుడు
మురికి కాలువల్లో మలినాన్ని తీసి
,
చీపురు చేత బట్టి చెత్త చెదారాన్ని
చేతులతో
ఎత్తి స్వచ్ఛతను ఇచ్చెను
సపాయి కార్మికుడు

మేఘాల్ని తాకే మేడలు కట్టి
విలాసవంతమైన నివాసమును
ఏర్పాటు చేసే భవన నిర్మాణ
శిల్పి సుతారి కార్మికుడు
ఆకాశమంత ఎత్తులో నురగలు కక్కే
వెన్నెలలా కైపెక్కే తాటి కల్లులొట్టితో
దాహం తీర్చెను గీతా కార్మికుడు
కండల కష్టాన్ని నమ్ముకొని
మాసిన బట్టలతో మూటలు
మోసెను హమాలి కార్మికుడు
శరీరానికి సౌందర్యాన్ని ఇస్తూ
మగ్గాలు మృదంగాలై
మధుర స్వరాల్ని ధ్వనింపజేస్తూ
వస్త్రాలను ప్రసాదించెను
చేనేత కార్మికుడు

చెరువులను సంరక్షించేందుకు
నడుం బిగించిన గంగపుత్రులై
సమస్త మానవాళికి చేపల్ని
పౌష్టికాహారంగా ఇచ్చెను
మత్స్య కార్మికుడు

అన్ని రంగాల్లో అంతర్భాగంగా
సేవలందించేందుకు సర్వం
సిద్ధంగా
ఉండే సర్వంతర్యామి కార్మికుడు

– ముక్కపల్లి సాగర్
98662 09436

## వర్ధిల్లాలి!

మేడే మసులుతున్న రక్తపు టేరుల
కార్మిక, కర్షక చెమట చుక్కల స్వేదాగ్ని
సంధ్యా సమరం
ఇది నాటికి, నేటికీ ఆకలి ఆత్మల
హారతి కర్పూరం
ఆశావహుల అమృత భాండాగారం
మృతవీరుల త్యాగఫలం మహాజనుల
కన్నీటి జలం
కణకణానా కెలుకుతుంది.....
నుదుటున సిందూరమై..!

మేడేకు కులం లేదు, కుట్ర లేదు
మతం లేదు వర్గం లేదు
మానవతే హితం జగత్ అని
శ్వాసను ఊదిన శాసనం..!
భూమి, భుక్తి, విముక్తి పోరాటాలకు
పురుడు పోసిన పున్నమి జాబిలి
దోపిడీ దొంగల, బూర్జువా వ్యవస్థను
పెకిలించిన ప్రగతి రథ చక్రం..!

మేడే శ్రమ సౌందర్యం
సకల జనుల ఔదార్యం
కలతలేని నడక
కందిపోని మరక..!

అందుకే నువ్వంటే
పిల్లా పెద్దలు కేరింతలు పెడుతూ
కాగడాలతో విప్లవాన్ని నినదిస్తున్నారు..
విశ్వవ్యాపితంగా.!
వర్ధిల్లాలి.. వర్ధిల్లాలి..!

– ఎల్. ఉపేందర్
99494 92677

## రెడ్ శాల్యూట్

తనువు ధనువుని వంచి
పలుగు శరాన్ని పాతాళానికి
దించి
రాతినేలలు తొలిచి
బంగారు రాశులు వెలికితీసే
భగీరథుడు
కండలు కరిగించి
ఘర్మజలాన్ని పారించి
నల్ల బంగారు సిరులు పండించే
హాలికుడు
నుశి రాశులు పులుముకొని
వెలుగుల మూడోకన్ను
తెరచుకొని
కాలుష్య గరళాన్ని
కంఠంలో నింపుకొని
ప్రమాదపుటంచులపై
నిత్య నర్తన చేసే నిటలేక్షణుండు
పుడమి కడుపున
ప్రతి దినముదయించు
పూర్ణచంద్రుడు
అగాథాల దాగున్న
అనంత సంపద వెలికితీసి
సింగరేణి నుదుటిపై
శిరుల సింధూరమద్ది
ఆకలి వేదనలననుభవించు
అభాగ్యుడతడు
నేలమాళిగ నగరాల్లో
వెలుగుదారులు పరచి
చిమ్మ చీకటి బతుకుతో
బొగ్గు గుట్టల గుండెల మాటున
అస్తమిస్తున్న చెమట సూర్యుడు!

– సవ్యసాచి
82470 10450

## ఎన్నేళ్ళు?

కాలసముద్రంలో
కలిసిపోయాయి
నేను నది నువ్వు సాగరం
ఏడడుగులు ఏనాడు పడ్డాయో
కొనసాగుతూనే వుంది మన
యాత్ర
నాకు గాయమైతే సలపరం
నీకెలా
నువ్వు కన్నీళ్లు కారిస్తే
నా కళ్లెందుకు సజల?
పుష్పాలుగా మారుతున్నాయి
ప్రేమే ఇరుసుగా మన
బతుకు బండి పరిగెడుతోంది
ఇప్పుడు మనకు
సరిహద్దులు లేనే లేవు
ఎప్పటిలా మన దేహాలకు
అలసటా లేదు
నువ్వు చెట్టువి నేను విత్తుని
పండి నేల రాలడం మనకు
పరిపాటే
కాల ప్రవాహంలో నౌకలై
తేలియాడడం
కాలాన్ని వేళ్ళ సందుల్లోంచి
ఖర్చు పెట్టడం
మనకే చెల్లింది!

– చింతా అప్పల నాయుడు
94417 13185

## నాడే 'మేడే' నోయ్

కాలే కొలిమిలో కార్ఖానాల్లో
కాలే కడుపుతో కండలు కరిగించి
ఉత్పత్తులు సృష్టించే కర్షక జీవులు
బానిస బతుకులు పోవాలని

శ్రమకు తగిన ప్రతిఫలం దక్కాలని
కార్మిక హక్కుల కోసం
ఎనిమిది గంటల పని దినం కోసం
గొంతెత్తి నిడదించిన రోజు ..
శ్రమ దోపిడీపై
పెట్టుబడిదారీ వ్యవస్థపై
ఎర్రటి నెత్తురు చిందించి
శ్రామిక జెండాను సృష్టించిన రోజు
ఎర్రజెండా పోరు బాట ద్వారా
వ్యవస్థ మారుతుందని
హక్కులు దక్కుతాయని
చాటిన రోజు.. నాడే మేడేనోయ్!

– ఎస్.కె.బాజీ సైదా
8897282981

# బిజెపిని ఒంటరి చేసి, ఓడించాలి

- దేశం ముందున్న ప్రధాన కర్తవ్యం ఇదే!
- ఈ లక్ష్యసాధనకు లౌకిక, ప్రతిపక్ష పార్టీలతో కలసి పనిచేస్తాం
- సిపిఎం కేంద్ర కమిటీ పునరుద్ఘాటన
- జమ్మూకాశ్మీర్‌లో సత్వర ఎన్నికలకు డిమాండ్

**న్యూఢిల్లీ :** బిజెపిని ఒంటరిపాటు చేసి, ఓడించడమే దేశం ముందు, ప్రజల ముందు ఉన్న ప్రధాన కర్తవ్యమని, ఈ లక్ష్యాన్ని సాధించేందుకు లౌకిక , ప్రతిపక్ష పార్టీలతో సిపిఐ(ఎం) కలిసి పనిచేస్తుందని, సహకరిస్తుందని పార్టీ కేంద్రకమిటీ పునరుద్ఘాటించింది. అలాగే జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేసింది. అదానీ అవినీతి బాగోతంపై జెపిసిని వెంటనే ఏర్పాటు చేయాలని కోరింది. ఈ నెల 27-29 తేదీల్లో ఇక్కడ జరిగిన సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆదివారం నాడు ఒక ప్రకటన రూపంలో పార్టీ విడుదలజేసింది. ఆ ప్రకటన ఇలా పేర్కొంది.

**రెజ్లర్ల నిరసన**

లైంగిక వేధింపుల ఆరోపణలకు వ్యతిరేకంగా న్యాయం చేయాలని కోరుతూ పతక విజేతలైన రెజ్లర్లు చేస్తున్న ఆందోళనకు కేంద్ర కమిటీ పూర్తి మద్దతు ఇస్తున్నది. తొలుత విముఖత చూపినప్పటికీ భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యుఎఫ్ఐ) అధ్యక్షుడు, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సి వచ్చింది.

డబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షుడిని ఆ పదవి నుండి తొలగించాల్సిందేనని కేంద్ర కమిటీ డిమాండ్ చేసింది. ఆ ఎఫ్ఐఆర్‌పై పోలీసులు తదుపరి చర్యలు చేపట్టి, కఠినంగా శిక్షించాలని కోరింది.

### అదానీ అవినీతిపై జెపిసిని వెంటనే వేయాలి

అదానీ గ్రూపుపై వచ్చిన అవినీతి ఆరోపణలపై దర్యాప్తు చేపట్టడానికి ప్రభుత్వం మొండిగా తిరస్కరించడం, దర్యాప్తుపై సెబీ రిపోర్టు ఇవ్వడానికి మే 2తో పూర్తవుతున్న గడువును, మరో ఆరు మాసాల పాటు పొడిగించాలని కోరుతూ సెబి పిటిషన్ వేసింది. ఈ అవినీతి ఆరోపణలపై నిజాలు నిగ్గు తేలాలంటే సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) వెంటనే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

### ఆర్థిక పరిస్థితి గడ్డుగానే ఉంది

ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే భారతదేశ జిడిపి వృద్ధి అత్యంత వేగంగా జరుగుతోందని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) పేర్కొంది. మోడీ ప్రభుత్వం దీనినే మరింత అతిశయంగా ప్రచారం చేస్తూ ఆర్థిక వ్యవస్థ వాస్తవ పరిస్థితిని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తోంది. 2021 ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు 9.1శాతం వుండగా, 2020లో అది –5.8గా వుండటాన్ని ప్రభుత్వం వాస్తవంగా విస్మరిస్తోంది. సాధారణ, కోవిడ్ ముందు సంవత్సరమైన 2019లో సమ్మిళిత వార్షిక వృద్ధిరేటును పరిగణనలోకి తీసుకుంటే, భారతదేశ వార్షిక వృద్ధి రేటు 3.8శాతం మాత్రమే. 2022, 2023 ఆర్థిక సంవత్సరాల్లో భారత్ 350బిలియన్ల డాలర్లను తన ఆర్థిక వ్యవస్థకు జోడించింది. అదే సమయంలో అమెరికా 1390 డాలర్లను, చైనా 1274 డాలర్లను వాటి ఆర్థిక వ్యవస్థకు జోడించాయి. పెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన దేశాలతో పోలిస్తే భారత్ తలసరి ఆదాయం చాలా తక్కువ. తలసరి ఆదాయం దృష్ట్యా చూసినట్లైతే, అమెరికా మన కన్నా 31రెట్లు , చైనా ఐదు రెట్లు, బ్రెజిల్ 4 రెట్లు, బ్రిటన్ 18రెట్లు, జర్మనీ 20రెట్లు అధికంగా కలిగి వున్నాయి. ఆ రకంగా చూసినట్లైతే, ప్రపంచంలోని ఐదవ అతిపెద్ద జిడిపితో వున్నప్పటికీ మన తలసరి ఆదాయం అంగోలా, ఐవరీ కోస్ట్‌ల కన్నా తక్కువగా వుంది.

తయారీ రంగం, పారిశ్రామిక రంగాలు క్షీణించిపోయినా, స్తంభించిపోయాయి. 8 కోర్ రంగాల వృద్ధి ఫిబ్రవరిలో 7.2శాతం వుండగా, మార్చిలో నాటికి సగం అంటే 3.6శాతానికి పడిపోయింది.

దీని పర్యవసానంగా నిరుద్యోగిత రేటు రికార్డు స్థాయిలో పెరిగి 8శాతం వద్ద కొనసాగుతోంది. ఉద్యోగుల సంఖ్య దాదాపు స్తంభించిపోయింది. కరోనా మహమ్మారి తలెత్తడానికి ముందు 2020 జనవరిలో ఉద్యోగుల సంఖ్య 41.1కోట్లుగా వుండగా, 2023 జనవరిలో 40.9కోట్లుగా వుంది. గత ఎనిమిదేళ్ళుగా గ్రామీణ వేతనాలు పూర్తిగా స్తంభించిపోయాయి. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఎస్) అత్యంత అవసరంగా వున్న సమయంలో, బడ్జెట్ కేటాయింపుల్లో మూడో వంతు కోత విధించారు. చెల్లించాల్సిన వేతనాలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్నాయి.

ఇటువంటి పరిస్థితుల్లో, కేంద్ర ప్రభుత్వం ఉపాధి కల్పన పథకాలపై మరింతగా ఖర్చు పెట్టాలని కేంద్ర కమిటీ డిమాండ్ చేస్తోంది. దీనివల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయి, ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది, ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ కూడా పెరుగుతుంది.

**జమ్మూ కాశ్మీర్**

2018 నుండి జమ్మూ కాశ్మీర్‌కు ఎన్నికైన అసెంబ్లీ లేదు. ఎన్నికలు నిర్వహించడానికి కేంద్ర ప్రభుత్వం మూడు షరతులను విధించింది. పునర్విభజనా క్రమాన్ని పూర్తి చేయడం, ఓటర్ల జాబితాను ఆధునీకరించడం, ఎన్నికల నిర్వహణకు శాంతియుత వాతావరణాన్ని ఏర్పాటు చేయడం – ఈ మూడు షరతులు నెరవేరాలని పేర్కొంది. ఆ మూడు నెరవేరాయని ప్రభుత్వమే అంగీకరించింది. అయినప్పటికీ ఎన్నికల నిర్వహణకు తిరస్కరించడం చూస్తుంటే, అక్కడ తనకు నచ్చిన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలననే నమ్మకం పాలక పక్షానికి లేదని ఇది స్పష్టంగా రుజువుచేస్తోంది. ప్రజల మౌలిక రాజ్యాంగ బద్ధమైన, ప్రజాస్వామ్య హక్కులను ఇది దారుణంగా ఉల్లంఘించడమే. జమ్మూ కాశ్మీర్‌లో వెంటనే ఎన్నికలను నిర్వహించాలని కేంద్ర కమిటీ డిమాండ్ చేస్తోంది.

**త్రిపుర**

త్రిపురలో అసెంబ్లీ ఎన్నికల అనంతరం పాలక బిజెపి చేపట్టిన హింస కొనసాగడాన్ని కేంద్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. భౌతిక దాడులతో పాటూ పెద్ద ఎత్తున బలవంతపు వసూళ్ళకు పాల్పడడం కూడా జరుగుతోంది. డిమాండ్ చేసిన డబ్బు గనక చెల్లించకపోతే వారి ఆస్తులను, దుకాణాలను, ఆటో రిక్షాలు వంటి జీవనోపాధులను ధ్వంసం చేస్తామంటూ ప్రజలను బెదిరిస్తున్నారు. ఇది లక్షలాదిమంది ప్రజల జీవితాలను, వారి జీవనోపాధులను దెబ్బతీస్తోంది. తక్షణమే ఈ హింసను ఆపాలని కేంద్ర కమిటీ డిమాండ్ చేస్తోంది. రాజ్యాంగ నిబంధనలకు గట్టిగా కట్టుబడాలని కోరుతోంది. దోషులను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతోంది.

**ప్రతిపక్షాల ఎత్తుగడలు**

బిజెపిని ఏకాకిని చేసి, ఓడించాలన్నదే దేశం ముందు, ప్రజల ముందున్న ప్రధాన కర్తవ్యమని కేంద్ర కమిటీ పునరుద్ఘాటించింది. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు, సిపిఎం, ఇతర లౌకిక ప్రతిపక్ష పార్టీలకు సహకరిస్తూ, వాటితో కలిసి పనిచేస్తుంది.

మత విభజన రాజకీయాలకు మరింత పదును పెట్టడం, ద్వేషం, హింస వంటి వాటితో కూడిన విషపూరిత ప్రచారం, ఆదానీ కుంభకోణం, కేంద్ర సంస్థల దుర్వినియోగం, కులాలవారీ జనగణనకు తిరస్కరించడం, సమాఖ్యవాదంపై దాడి వంటి జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశాలను ప్రముఖంగా ఎత్తిచూపడానికి లౌకిక ప్రతిపక్ష పార్టీల మధ్య గరిష్ట ఐక్యత వుండాలి. అలాగే ప్రజల జీవనోపాధులపై దాడులకు వ్యతిరేకంగా నిరసన చర్యలు చేపట్టేందుకు అన్ని లౌకిక ప్రతిపక్ష శక్తుల మధ్య ఐక్యత అవసరం, ప్రతి రాష్ట్రంలోనూ అక్కడ వున్న నిర్దిష్ట పరిస్థితుల ఆధారంగా ఎన్నికల్లో బిజెపి వ్యతిరేక ఓట్లను గరిష్టంగా సమీకరించేందుకు లౌకిక ప్రతిపక్షం ఎత్తుగడలను రూపొందించేందుకు కసరత్తు చేయాలి. రాష్ట్రం నుండి రాష్ట్రానికి పరిస్థితులు మారుతుండడంతో ఈ ఏర్పాట్లన్నీ కచ్చితంగా రాష్ట్ర అవసరాలు, పరిస్థితులకు తగ్గట్లుగా వుండాలి.

### కేంద్ర కమిటీ పిలుపు

దేశం, ప్రజల జీవనోపాధులపై తక్షణం ప్రభావం చూపే అంశాలపై దేశవ్యాప్తంగా సమైక్య కార్యాచరణ చేపట్టేందుకు వామపక్షాలను సంప్రదించాలని కేంద్ర కమిటీ నిర్ణయించింది.

ప్రజా కార్యాచరణ, వ్యక్తీకరణల ద్వారా జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశాలను లేవనెత్తడానికి ఇతర లౌకిక ప్రతిపక్ష పార్టీలతో సంప్రదింపులు జరపాలి.

**నిర్మాణపరమైన అంశం**

వ్యవసాయ కార్మికోద్యమ నేత విక్రమ సింగ్‌ను కేంద్ర కమిటీ సభ్యులుగా తీసుకోవడం ద్వారా కేంద్ర కమిటీలో ఖాళీని భర్తీ చేయాలని కేంద్ర కమిటీ నిర్ణయించింది.

## అటవీ సంరక్షణ చట్ట సవరణ

వృధా అయిన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో గందరగోళ పరిస్థితుల మధ్య ప్రవేశపెట్టిన అటవీ సంరక్షణ చట్టం సవరణ ఓ వినాశకరమైన చర్య. వాతావరణ మార్పుల సవాళ్ళను మరింత అధ్వానంగా మార్చే చర్య. ఇప్పటికే వాతావరణ మార్పుల ప్రభావం దేశంలో వివిధ ప్రాంతాలపై చూపుతోంది. తమ ప్రాంతాల్లో ఏ ప్రాజెక్టు అయినా చేపట్టడానికి ముందు అనుమతినివ్వడానికి లేదా నిలుపుచేయడానికి గ్రామ సభలకు గల రాజ్యాంగబద్ధమైన, చట్టబద్ధమైన హక్కులను ఈ సవరణలు తొలగిస్తున్నాయి. అలాగే అటవీ భూముల మళ్లింపునకు సంబంధించిన నిబంధనల సరళీకరణ, అడవుల ప్రైవేటీకరణను ప్రోత్సహించడం, అటవీ పాలనపై రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను నీరుగార్చేందుకు కేంద్ర ప్రభుత్వానికి మరిన్ని అధికారాలను ఇవ్వడం వంటి చర్యలు ఆదివాసీల, సాంప్రదాయ అటవీవాసుల హక్కులపై మరింతగా దాడిచేయడమే, ప్రస్తుతమున్న అటవీ హక్కుల చట్టాన్ని ప్రత్యక్షంగా ఉల్లంఘించడమే. ఈ సవరణను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఐ(ఎం) డిమాండ్ చేస్తున్నది.

## అవినీతి రహిత రాష్ట్రంగా కేరళ

- సిఎం విజయన్



**కోజికోడ్ :** కేరళను పూర్తిగా అవినీతి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. రాష్ట్ర స్థాయి తాలూకా అదాలత్ కరటల్, కైతాంగ్‌లను ఆయన ప్రారంభించారు. కేరళలో అవినీతి తక్కువగా ఉందని అధ్యయనంలో తేలిందని చెప్పారు. కొన్నిచోట్ల అవినీతికి సంబంధించిన సమస్యలు ఉన్నాయని, వాటిని కూడా తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవినీతిపరులపై కనికరం ఉండదని చెప్పారు. కార్యాలయాల్లో సేవలు అందించడం ప్రజలకు వరం కాదని, వారి హక్కు అనే స్పృహ అధికారుల్లో ఉండాలని అన్నారు. ఫైళ్లు పెండింగ్‌లో ఉంచే పద్ధతిని తొలగించాలని చెప్పారు. సమస్యల సత్వర సత్వర పరిష్కారం కోసం మంత్రులు హాజరై, తాలూకా స్థాయి అదాలత్‌లు నిర్వహిస్తారని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయాలను త్వరగా అమలు చేయడానికి సరిపడా ఐఎఎస్ అధికారులు లేకపోవడంతో, కేరళ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌ను ప్రారంభించామని తెలిపారు.

**త్వరలో ప్రగతి నివేదిక**

ఎల్‌డిఎఫ్ పాలనలో సంక్షేమ పింఛన్లు, ఆరోగ్య బీమా, 2.31 లక్షల భూమి పట్టాలు, సుమారు 3.5 లక్షల ఇళ్లను అందించారు. రెండో ఏడాదిలో ఎంత పురోగతి సాధించిందో తెలుసుకునేందుకు త్వరలోనే ప్రగతి నివేదికను విడుదల చేస్తామని ముఖ్యమంత్రి విజయన్ తెలిపారు. మంత్రి పిఎ మహమ్మద్ రియాజ్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## రాజ్యాంగానికి సవాలుగా బిజెపి విధానాలు

- ఎఐఎడబ్ల్యుయు జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్

**ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో**

కేంద్రం, వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని విధ్వంసం చేయటం, ఆధిపత్య భావజాలాన్ని సమాజంపై రుద్దటమే లక్ష్యంగా



పెట్టుకున్నదని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ విమర్శించారు. ఆదివారం ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ముఖ్య కార్యకర్తల విస్తృత సమావేశంలో ఆయన ప్రసంగించారు. కార్పొరేట్లు, మతోన్మాదులు కలిసి దేశంలో పెట్రేగిపోతున్నారని, అరాచకాలు, దౌర్జన్యాలతో పాలన సాగిస్తున్నారని అన్నారు. దేశ సంపదను అడ్డగోలుగా సంపన్నులకు దోచిపెడుతున్నారని విమర్శించారు. దళితులు, గిరిజనులు, మైనారిటీలను లక్ష్యంగా చేసుకొని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం సామాజిక తరగతుల హక్కులు చట్టాలను సమాధి చేస్తున్నదని ధ్వజమెత్తారు. ఈ అఘాయిత్యాలకు వ్యతిరేకంగా వ్యవసాయ కార్మికులు ఇతర సామాజిక తరగతులను కలుపుకొని సమరశీల ఉద్యమాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉపాధి హామీని నిర్వీర్యం చేసారని, అభివద్ధి పేరుతో అణగారిన తరగతుల భూములను యోగి ప్రభుత్వం గుంజుకుంటున్నదని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుండి పెద్ద సంఖ్యలో ఇతర రాష్ట్రాలకు పేదల వలసలు పోతున్నారని ఆయన విమర్శించారు.

## కృత్రిమ మేథస్సుపై రిస్క్‌తో కూడిన నియంత్రణ వుండాలి

- జి 7 దేశాల అంగీకారం





**తకసాకి :** కృత్రిమ మేథస్సుపై రిస్క్ ప్రాతిపదిక కలిగిన నియంత్రణను జి7 దేశాలు అనుసరించాలని ఆ దేశాల డిజిటల్ మంత్రులు ఆదివారం అంగీకరించారు. చాట్ జిపిటి వంటి కొత్తగా ఆవిర్భవిస్తున్న సాధనాలపై నిబంధనలను అమలు చేసేందుకు ఎఐ చట్టాన్ని ప్రవేశపెట్టడానికి యురోపియన్ పార్లమెంట్ సభ్యులు తొందర పడుతున్నారు. అటువంటి నియంత్రణ కృత్రిమ మేథస్సు సాంకేతికతల అభివృద్ధికి, "పారదర్శకమైన, అనుకూలమైన వాతావరణాన్ని కూడా పరిరక్షించాలని", ఇందుకు ప్రజాస్వామ్య విలువలు ప్రాతిపదికగా వుండాలని జి 7 మంత్రులు సంయుక్త ప్రకటనలో కోరారు. జపాన్‌లోని తకసాకిలో రెండు రోజుల సమావేశానంతరం సంయుక్త ప్రకటన జారీచేశారు. ఉమ్మడి దార్శనికతను, నమ్మకమైన కృత్రిమ మేథస్సు లక్ష్యాన్ని సాధించేందుకు విధానపరమైన సాధనాలనేవి జి 7 సభ్య దేశాల్లో మారుతూ వుండొచ్చునని మంత్రులు గుర్తించారు. గోప్యతా పరమైన ఆందోళనలు, భద్రతాపరమైన ముప్పులు నెలకొన్న నేపథ్యంలో కృత్రిమ మేథస్సును ప్రధాన దేశాలు ఎలా నిర్వహించగలవనేందుకు ఈ ఒప్పందం ఒక ల్యాండ్‌మార్క్‌ను రూపొందించింది. ఈ రంగంలో కచ్చితంగా మనం ఏకాకులం కాదన్న విషయాన్ని ఈ జి 7 సమావేశం నిర్ధారణలు రుజువు చేస్తున్నాయని యురోపియన్ కమిషన్ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు మార్గరెట్ వెస్టాగర్ వ్యాఖ్యానించారు. చాట్ జిపిటి, చాట్‌బోట్ వంటి ఎఐ సాధనాలు ప్రజాదరణ పొందడంపై ప్రభుత్వాలు ముఖ్యంగా దృష్టి పెడుతున్నాయి. నిర్వహణ, కాపీరైట్‌తో సహా మేథో సంపత్తి హక్కుల పరిరక్షణ, పారదర్శకతను పెంపొందించడం, తప్పుడు సమాచారాన్ని ఎదుర్కొనడం వంటి అంశాలపై భవిష్యత్తులో కూడా జి 7 చర్చలు జరపాలని భావిస్తున్నట్లు ఆ ప్రకటన పేర్కొంది.

## కేంద్ర మంత్రి షెకావత్‌పై ఎఫ్ఐఆర్

**జైపూర్ :** అశోక్ గెహ్లాట్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. చిత్తోర్‌గఢ్‌లో ఏప్రిల్ 27న బిజెపి నిర్వహించిన 'జన ఆక్రోశ్' ర్యాలీలో సిఎం అశోక్ గెహ్లాట్ రాజస్థాన్‌లో రాజకీయాల రావణుడు అని, రాష్ట్రంలో రామరాజ్యాన్ని స్థాపించాలని నిర్ణయించుకోవాలని షెకావత్ ప్రజలను కోరారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సురేంద్రసింగ్ జదావత్ శనివారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. గెహ్లాట్ ప్రతిష్టను దెబ్బతీయడంతోపాటు మతపరమైన భావాలను రెచ్చగొట్టేందుకే షెకావత్ ఆ వ్యాఖ్యలు చేశారని జదావత్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

## అమెరికా యువతలో పెరుగుతున్న ఆత్మహత్యలు

**వాషింగ్టన్ :** అమెరికా యువతలో ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఓ అధ్యయనం తెలిపింది. ముఖ్యంగా 13 నుండి 14 ఏళ్ల వయసు గల యువకులలో ఆత్మహత్యల రేటు తీవ్రంగా పెరుగుతోందని ఫ్లోరిడా అట్లాంటిక్ విశ్వవిద్యాలయం (ఎఫ్ఎయు) ష్మిద్ కాలేజీ ఆఫ్ మెడిసిన్ అధ్యయనం పేర్కొంది.



2008 మరియు 2018 మధ్య కాలంలో అమెరికా యువతలో ఆత్మహత్యలు రెండింతలు పెరిగాయని తెలిపింది. లింగం, జాతి భేదాలు లేకుండా ఆత్మహత్యలు పెరుగుతున్నాయని పేర్కొంది. సోషల్‌మీడియా వినియోగం, చదువుల ఒత్తిడి, తుపాకీ వినియోగం పెరగడం ఆత్మహత్యల పెరుగుదలకు కారణమని వివరించింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆత్మహత్యలు పెరుగుతున్నాయని, తుపాకీలు సులభంగా దొరికే ప్రాంతాల్లో ఇవి మరింత అధికంగా ఉంటున్నాయని తెలిపింది. ఆత్మహత్యలు సెప్టెంబర్ , మే నెలల మధ్య, అలాగే సోమవారాల్లోనూ అధికంగానూ, మిగిలిన వారాల్లో తక్కువగా ఉంటున్నాయని పేర్కొంది. చదువుల ఒత్తిడి యువతలో ఆత్మహత్య ఆలోచనలను కలిగిస్తోందని అధ్యయనం వివరించింది. గ్రామీణ ప్రాంతాల్లో యువత ఆత్మహత్యల్లో 46.7 శాతం మంది తుపాకీలను వినియోగించగా, మెట్రోపాలిటన్ నగరాల్లో 34.7 శాతం మంది వినియోగిస్తున్నారని అధ్యయన వేత్తల్లో ఒకరైన ప్రొఫెసర్ చార్లెస్ హెచ్. హెన్నెకెన్స్ తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న 13 నుండి 14 ఏళ్ల వయసు కలిగిన టీనేజర్లు అంతకుముందు సంవత్సరాల్లోనే సోషల్‌మీడియాలోని పలు నెట్‌వర్క్‌లలో అకౌంట్లు కలిగి ఉన్నట్లు అధ్యయనంలో తేలిందని హెన్నెకెన్స్ పేర్కొన్నారు. వీరు అధికంగా రెడ్డిట్, యూట్యూబ్, ట్విట్టర్, ఫేస్‌బుక్, మైస్పేస్, టంబిర్‌లను వినియోగిస్తున్నారని తెలిపారు.

# అమిత్ షాను విమర్శించడమే నేరమా?

- సిపిఎం ఎంపీకి రాజ్యసభ చైర్మన్ నోటీసు
- నా వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నా : జాన్ బ్రిట్టాస్

**ప్రజాశక్తి –న్యూఢిల్లీ బ్యూరో**

మొన్న న్యాయ వ్యవస్థపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి, అన్ని వైపుల నుంచి విమర్శలు ఎదుర్కొన్న ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కర్ తాజాగా రాజ్యసభ సభ్యుని హక్కుపై దాడి చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాను విమర్శిస్తూ పత్రికలో వ్యాసం రాసినందుకు సిపిఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్‌కి రాజ్యసభ చైర్మన్ హెూదాలో ధన్‌కర్ సమన్లు జారీ చేశారు. ఎన్నికలు జరుగుతున్న కర్ణాటకలో చేసిన ఓ ప్రసంగంలో అమిత్ షా కేరళను చిన్నచూపు చూశారని ఆ వ్యాసంలో సిపిఐ(ఎం) ఎంపి పేర్కొనడంపై వివరణ కోరారు. రాజ్యసభ చైర్మన్ చర్య తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని జాన్ బ్రిట్టాస్ అన్నారు. ఆ వ్యాసంలో తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని సిపిఐ(ఎం) ఎంపీ స్పష్టం చేశారు.

ధన్‌కర్‌ను కలవాల్సిందిగా రాజ్యసభ సెక్రటేరియట్ తొలుత తనకు నోటీసు పంపగా, గత వారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, తన వైఖరిని మౌఖికంగా తెలియజేశాను. దీనిపై లిఖితపూర్వక వివరణ కావాలని



చైర్మన్ అడగడం తనను విస్మయానికి గురి చేసిందన్నారు. రాజ్యసభ చైర్మన్ రాజ్యాంగ స్వరూప స్వభావాలను గురించి తెలిసినవారు, తన సభ్యుల హక్కులను కాపాడతారని తాను ఆశిస్తున్నానని సిపిఐ(ఎం) ఎంపీ అన్నారు. ధన్‌కర్‌ను బ్రిట్టాస్ కలిసిన విషయాన్ని రాజ్యసభ వర్గాలు ధ్రువీకరించడం కానీ, తిరస్కరించడం కానీ చేయలేదు. దీనిపై రాజ్యసభ సెక్రటేరియట్ అధికారిని ప్రశ్నించగా "అన్ని సమావేశాలకు అధికారులను పిలవరు" అని ఆయన ముక్తసరిగా సమాధానమిచ్చారు.

బ్రిట్టాస్ దేశద్రోహానికి పాల్పడ్డారని కేరళ బిజెపి ప్రధాన కార్యదర్శి పి.సుధీర్ చేసిన ఫిర్యాదు ఆధారంగా ధన్‌కర్ ఈ చర్య తీసుకున్నారు. రాజ్యసభ చైర్మన్‌కు బిజెపి నాయకుడు ఫిర్యాదు చేయడం. అధికార పక్షం నుంచి వచ్చిన ఫిర్యాదుపై చర్చించడానికి చైర్మన్ తనను పిలిపించి, వివరణ అడగడం చూసి విస్తుపోయానని బ్రిట్టాస్ పేర్కొన్నారు.

ఫిబ్రవరి 20న ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రచురించబడిన "ప్రచారానికి సంబంధించిన ప్రమాదాలు" అనే శీర్షికతో బ్రిట్టాస్ తన అభిప్రాయాన్ని రాశారు. కర్ణాటక పర్యటనలో షా "తన పార్టీ మాత్రమే కర్ణాటకను సురక్షితంగా ఉంచగలదని" చెప్పినట్టు రాశారు. కర్ణాటకలో కేరళ గురించి "...మీ దగ్గర కేరళ ఉంది. దాని గురించి నేను పెద్దగా చెప్పదలచుకోలేదు" అంటూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఉటంకిస్తూ వ్యాసం రాయడం నేరమా? ఆ వ్యాసంలో హోం మంత్రిపై చేసిన విమర్శలో తప్పేమిటి? అని ప్రశ్నించారు. వాక్ స్వాతంత్ర్యం. భావప్రకటనా స్వేచ్ఛ ప్రతి పౌరుని ప్రాథమిక హక్కు అన్న విషయం గుర్తించాలని ఆయన అన్నారు. "కేరళను లక్ష్యంగా చేసుకుని షా చేసే ప్రకటనలు ఆయనలో నైరాశ్యానికి అద్దం పడుతున్నాయని బ్రిట్టాస్ విమర్శించారు. దేశంలో భాగమైన కేరళను కించపరిచేలా కేంద్ర హోంమంత్రి మాట్లాడటం దుర్మార్గమని ఆయన అన్నారు.



రెజ్లర్ల ఆందోళన ఉద్దేశించి మాట్లాడుతున్న ఎఐకెఎస్ నేత కృష్ణ ప్రసాద్

## న్యాయం కోసం వారం రోజులుగా వీధుల్లో....

- రెజ్లర్లకు ఎస్‌కెఎం మద్దతు
- ప్రధాని మోడీ రెజ్లర్ల మన్ కీ బాత్ వినాలి: వినేష్ ఫోగట్

**ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో**

న్యాయం కోసం వారం రోజులుగా వీధుల్లో రెజ్లర్లు ఆందోళన చేస్తున్నారు. బిజెపి ఎంపి, డబ్ల్యుఎఫ్ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ ను అరెస్టు చేయాలని దేశంలోని అగ్రశ్రేణి రెజ్లర్లు జంతర్ మంతర్ వద్ద చేస్తున్న ఆందోళన ఆదివారం కూడా కొనసాగింది. ట్విట్టర్ లో "అరెస్టు బ్రిజ్ భూషణ్ నౌ" యాస్ ట్యాగ్ ట్రెండింగ్ లో ఉంది. రెజ్లర్ల బజరంగ్ పూనియా మాట్లాడుతూ మెజార్టీ మీడియా తమ ఆందోళన కంటే, బ్రిజ్ భూషణ్ కే ఎక్కువ మద్దతు ఇస్తుందని విమర్శించారు. న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. వినేష్ ఫోగట్ మాట్లాడుతూ ప్రధాని మోడీ రెజ్లర్ల డిమాండ్ వినాలని డిమాండ్ చేశారు. "ప్రధానమంత్రి రెజ్లర్ల 'మన్ కీ బాత్(మనసులో మాట)' కూడా వినాలి. మాకు మద్దతుగా కోట్లాది మంది కూర్చున్నారు. ఇదే మా బలం. ఎంత మంది ఎంపిలు, ఎమ్మెల్యేలు ఉన్నారో మాకు తెలియదు" అని వినేష్ ఫోగట్ అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కె ఎం) మద్దతు తెలిపింది. ఎఐకెఎస్ నేత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ రెజ్లర్లకు రైతులు అండగా ఉంటారని తెలిపారు. రెజ్లర్లకు ఆర్జేడీ చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్, డిఎంకె ఎంపి కనిమొళి, భీమ్ ఆర్మీ ఛీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ లు మద్దతు తెలిపారు. టేబుల్ టెన్నిస్ బంగారు పతాక విజేత మానిక బత్రా, అర్జున్ అవార్డు గ్రహీత మను బాస్కర్ తదితరులు కూడా మద్దతు ప్రకటించారు.

**రెజ్లర్లు ఇళ్లకు వెళ్తే రాజీనామాకు సిద్ధం : బ్రిజ్ భూషణ్**

జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపినంత మాత్రాన న్యాయం జరగదని రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) అధ్యక్షుడు, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ అన్నారు. న్యాయం కావాలంటే పోలీసుల వద్దకు, కోర్టుకు వెళ్లాలని సూచించారు. అప్పుడు కోర్టు ఏం చెబితే దానికి కట్టుబడి ఉంటామని అన్నారు. తనపై ఆరోపణలు చేసిన వారు కాంగ్రెస్ ఎంపి దీపేందర్ హుడా పోషిస్తున్న అఖాడాకు చెందిన వారని ఆరోపించారు. ఆందోళనకారులు ఇంటికి తిరిగి వెళ్లి ప్రశాంతంగా నిద్రించేలా చేస్తే తాను రాజీనామాకు సిద్ధమని బ్రిజ్ భూషణ్ సింగ్ తెలిపారు.

## మరో 229 మంది తరలింపు

- కొనసాగుతున్న ఆపరేషన్ కావేరి

**న్యూఢిల్లీ :** అంతర్యుద్ధం జరుగుతున్న సూడాన్ నుంచి మరో 229 మంది భారతీయులు మన దేశానికి ఆదివారం బయల్దేరారు. ఆపరేషన్ కావేరిలో భాగంగా సూడాన్ నుంచి సౌదీ అరేబియాలోని జెడ్డా విమానాశ్రయానికి మనదేశానికి చెందిన 229 మందిని అధికారులు తరలించారు. అక్కడి నుంచి వారిని బెంగళూరు తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్లు విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ట్వీట్ చేశారు. అధికారిక సమాచారం ప్రకారం సూడాన్ నుంచి స్వదేశానికి తిరిగివచ్చిన మొత్తం భారతీయుల సంఖ్య 1954కి చేరింది.



## మీ కోసం


తొడిమలు తీసిన పచ్చి మిరపకాయలను ఫ్రిజ్‌లో పెట్టుకుంటే అవి ఎక్కువ రోజులు తాజాగా ఉంటాయి.

## జీవనసౌరభం

పైవారితో మాత్రమే కాదు; తన కన్నా తక్కువవారితోనూ మెలిగే తీరే వ్యక్తిత్వానికి అద్దం పడుతుంది.



# వృక్ష విన్నపం



నాకు బిరుదులివ్వాలని
పొగడ్తలే కురవాలని
ఎప్పుడైనా కోరానా
ప్రత్యేకత నివ్వాలని ...

నిలువనిచ్చు నీడనని
చోటు కాస్త వదలమని
చేతులెత్తి వేడుతున్న
విలువనిచ్చి పెంచమని

పెరటిలోన నేనుంట
గట్టుపై పెరుగుతుంట
కనికరించి పెంచారో
కలకాలం తోడుంట

మౌనంగా ఎదుగుతాను
నింగిలోకి పాకుతాను
ప్రేమ నీరు పోస్తిరంటె
పూలు, పండ్లు ఇస్తాను

ఏమి సొగసు పచ్చదనం
బతుకంతా పూలవనం
బంధమయ్యి సాగుతాను
ప్రాణవాయువొసగుతాను

నన్ను కావగ రావయ్య

నరుకుటను మానవయ్య
కల్పతరువు నేను కదా!
కనికరించి పెంచవయ్య!

మనసులోని భావాలను
మమకారపు తేనెలను
అవనికే హారముగా
తోరణమై నిలుస్తాను

ఊయలనై సాంత్వనగా
ఎలకోయిల నిలయముగా
గగనానికి కబురంపిన
చిరుజల్లుల తరువునుగా

గూడులేని పేదలను
అలసి ఉన్న ప్రాణులను
ఆశ్రయమై ఆదుకుంట
ఆత్మీయ నేస్తాలను

శాంతివనంబైయ్యి నేను
అవనికాంతి నింపుతాను
మనుగడకే మూలమౌతు
మదిగదిలో ఒదుగుతాను

- చైతన్య భారతి పోతుల
70132 64464

## సరైన నీడ ఏది?




చిన్నారులూ, రవి తన కుక్కపిల్లతో బయటకు వెళుతున్నాడు. ఎదురుగా కొన్ని నీడలు ఉన్నాయి. వాటిలో తన సరైన నీడను కనిపెట్టండి.

జవాబు : 4

## నేను గీసిన బొమ్మ



వై.గిరితిక,
4వ తరగతి,
పెన్నలపాడు
ప్రాథమిక పాఠశాల
తొట్టంబేడు
మండలం,
తిరుపతి జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

# సెలవుల్లో సమయ పాలన

**బడులకు సెలవులు ఇచ్చారు. చదువులు, పరీక్షలు ఒత్తిడితో సతమతమైన చిన్నారులకు కాస్త విరామం దొరికినట్లే. అలాగని, సమయాన్ని వృథా చేయొద్దు. మొబైళ్లు, టీవీల్లో తల పెట్టొద్దు. బదులుగా సెలవులు మరింత ఉల్లాసంగా గడపండి. అప్పుడే పై తరగతులకు వెళ్లేందుకు భయం లేకుండా పోతుంది. బాల్యంలో మధురక్షణాలు మిగిల్చుకున్నవారూ అవుతారు.**



- స్కూలుకి వెళ్లేప్పుడు ఏ సమయానికి అలారం పెట్టుకొని నిద్ర లేచేవారో అప్పుడే లేవండి. దాన్ని అలవాటుగా మార్చుకోండి. అయితే, కొన్ని రోజులు పుస్తకాలు తీయకుండా ప్రశాంతంగా ఆరుబయట ఆటలు ఆడండి. కొంత శరీరం కష్టపెట్టండి. దాంతో మానసికంగా ధృఢంగా మారతారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు ఆ వెసులుబాటు కల్పించాలి. తోటి పిల్లలతో కలిసి ఆటలు లేదా డ్యాన్స్ వంటి యాక్టివిటీస్‌కు ప్రోత్సహించండి. దీనివల్ల వారిలో సామాజిక చొరవ పెరుగుతుంది. ఇవి వ్యాయామమే కాదు, సహజ నిరోధక శక్తీ పెరుగుతుంది.
- పిల్లలు రెండు గంటల పాటు ఇంట్లో పనిలోనూ భాగస్వామి అయ్యేలా చూడాలి. బొమ్మలూ, అలంకరణ వస్తువుల తయారీ నేర్చుకునేలా చేయండి. వారికి ఎందులో ఆసక్తి ఉందో కనుక్కొని అందులోనే ప్రత్యేక మెలకువల్ని కనబరిచేలా సూచనలు ఇవ్వండి. యూట్యూబ్ ఛానెల్స్‌లో శిక్షణ లాంటివి ఉంటే ఇప్పించండి. సరదాగా గడుపుతూనే కొత్త అంశాలపై పట్టు తెచ్చుకోవడం వల్ల మెదడు చురుగ్గా పనిచేస్తుంది.
- చాలామంది పిల్లలు ఇంటికి బంధువులు వచ్చినా త్వరగా కలిసిపోలేరు. మాట్లాడేందుకు సిగ్గుపడటం, భయంతో వేరే గదిలో ఉండిపోవడం చేస్తూ ఉంటారు. ఇటువంటి వారి పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ కనబరచాలంటున్నారు నిపుణులు. బంధువులు, స్నేహితులు, సన్నిహితుల ఇళ్లకు తీసుకొని వెళ్లాలి. వారిని పరిచయం చేస్తూ, వారితో మాట్లాడేలా చూడాలి. క్రమంగా మార్పు కనిపిస్తుంది.
- దగ్గర్లో ఉన్న అందమైన ప్రాంతాలు, చారిత్రక ప్రదేశాలూ, మ్యూజియాలకు తీసుకెళ్లండి. అక్కడ వారు ఏం గ్రహించారు, ఏమి తెలుసుకున్నారో చెప్పమని అడగండి. వాటిని ఓ పేపర్ మీద రాయమని చెప్పండి. కథలు, కవితలు రాయమని, బొమ్మలు గీయమని చెప్పండి. దాంతో వారిలో సృజనాత్మకత మెరుగుపడుతుంది.
- అమ్మమ్మ, తాతయ్యల దగ్గరకు వెళ్లే వారికి అక్కడ ఉండే విశిష్టతలు, పంట పొలాలు, చెరువులను చూపించి ఉత్సాహపరచండి. దీని వల్ల పిల్లలకు మన మూలాలు తెలుస్తాయి.
- మధ్య మధ్యలో పై తరగతులకు సంబంధించిన పుస్తకాలను తీసి చదివిస్తూ ఉండాలి. అవసరమైతే అవసరమైన సబ్జెక్టుల్లో మెరుగుదలకు శిక్షణ ఇప్పించండి. స్కూలుకు వెళ్లాక వారికి ఆ సబ్జెక్టుల పట్ల భయం పోతుంది. ఆ పాఠాలపై కొంత అవగాహన కలిగి ఉంటారు కాబట్టి టీచర్లు చెప్పేది త్వరగా అర్థమవుతుంది.

## వేసవిలో జుట్టు సంరక్షణ ఇలా ...

**వేసవి కాలంలో జుట్టు ఆరోగ్యం క్రమంగా దెబ్బతింటుంది. ఎండ వేడి నేరుగా తలకు తగలడం వల్ల చెమట ఎక్కువగా పడుతుంది. దీంతో చుండ్రు సమస్య కూడా అధికమవుతుంది. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే.. జుట్టును ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని నిపుణులు అంటున్నారు.**

- బయటకు వెళ్లేప్పుడు.. జుట్టును స్కార్ఫ్ లేదా క్యాప్‌తో కవర్ చేసి ఉంచండి.
- కొంతమంది ఎండ వేడి తట్టుకోలేక, రోజూ తలస్నానం చేస్తూ ఉంటారు. దీనివల్ల జుట్టులోని తేమ, నూనె తొలగిపోయి జుట్టు నిర్జీవంగా తయారవుతుంది. కాబట్టి వీలైనంత వరకు తక్కువసార్లు తలస్నానం చేయాలి.
- జుట్టు కుదుళ్లు బలంగా తయారయ్యేందుకు గోరువెచ్చని నూనెతో మర్దన చేయాలి.
- సాధారణంగా పొడవాటి జుట్టు ఉన్నవారికి వేసవి వేడి వాతావరణంలో జుట్టుపై శ్రద్ధ పెట్టడం పెద్ద సమస్య. కాబట్టి పొడవు జుట్టు ఉన్న వారు జుట్టు రాలకుండా, చిట్లకుండా ఉండేలా పైకి టై చేసుకోవాలి.
- సముద్రం, ఈత కొలనుల్లో స్నానాలు చేసినప్పుడు జుట్టు పొడిబారుతుంది. బలహీనంగా, పెళుసుగా మారుతుంది. కాబట్టి అటువంటిచోట స్నానం చేసిన తరువాత మంచి నీళ్లతో మరోసారి తలస్నానం చేయాలి.
- వేడినీటి స్నానం శరీరానికే కాదు, జుట్టుకు కూడా మంచిదే. అయితే వేడినీటి స్నానం తరువాత చివరగా జుట్టును చల్లటి నీటితో కడగాలి. ఇలా చేస్తే.. జుట్టుకు బలం పెరిగి మెరుపుగా తయారవుతుంది.
- అలాగే తలస్నానం చేసిన తరువాత జుట్టు తడి ఆరాలని అదే పనిగా గట్టిగా రుద్దకూడదు. మెల్లిగా తుడవాలి.
- ఎండలో బయటకు వెళ్లేటప్పుడు జుట్టుకు లేదా మాడుకు సన్‌స్క్రీన్ లోషన్ రాయాలి.
- సన్‌స్క్రీన్ లోషన్ రాసుకున్నప్పుడు రాత్రి పడుకోబోయే ముందు తలస్నానం చేయాలి. అలా సాధ్యం కానప్పుడు ఆ లోషన్లకు బదులు కొబ్బరినూనెతో మర్దనా చేయాలి.
- వేసవికాలంలో జుట్టుకు నిమ్మరసం వాడినట్లయితే మరింత నిర్జీవంగా మారొచ్చు. కాబట్టి కాఫీ డికాషన్ లాంటి కండీషనర్లను వాడటం మంచిది.





## వేసవి కానుక .. పుచ్చకాయ

**వ**డదెబ్బ తగలకుండా ఉండాలంటే రోజూ పుచ్చకాయ తినాలి అంటున్నారు ఆహార నిపుణులు. పుచ్చకాయ డీహైడ్రేషన్ బారిన పడకుండా కాపాడుతుంది. పుచ్చకాయలో కెరోటినాయిడ్స్, బీటాకెరోటిన్ లు, విటమిన్ సి, విటమిన్ ఎ, విటమిన్ బి6, పొటాషియం పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులో గ్లూకోజ్, ఫ్రక్టోజ్, సుక్రోజ్ కూడా ఉంటాయి. ఇది తింటే నీరసం ఉండదు. వేసవిలో ప్రకృతి ప్రసాదించే ఆరోగ్యకరమైన కానుక పుచ్చకాయ.. దీనిని తింటే అన్నీ మేళ్లే జరుగుతాయి.

- పుచ్చకాయలో 92 శాతం నీరు ఉంటుంది. కిడ్నీ సంబంధిత వ్యాధుల బారినపడ్డవారు ఈ పుచ్చకాయని తేనెతో కలిపి తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.
- కీళ్ల నొప్పులు, వాతంతో బాధపడే వారు పుచ్చకాయ తింటే సమస్యలు తగ్గుతాయి.
- కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడుతున్నవారు పుచ్చకాయని తింటే మంచి ఫలితం ఉంటుంది.
- విరేచనాలు, కడుపునొప్పి, ఉబ్బరం, ఎసిడిటీ సమస్యలు తగ్గుతాయి. రక్తపోటు కంట్రోల్లో ఉంటుంది.
- ఇందులో విటమిన్ సి రోగ నిరోధకశక్తిని పెంచుతుంది. విటమిన్ బి6 శరీరంలో ఎర్ర రక్తకణాల సంఖ్యను పెంచుతుంది.
- రక్తనాళాల్లో ఉన్న చెడు కొవ్వు తొలగి గుండెపోటు సమస్యలు రావు. చర్మం ఆరోగ్య వంతంగా మెరుస్తూ ఉంటుంది.

# కొత్త తారల సందడి..

**సి**నీ ఇండస్ట్రీకి కొత్త తారలు రావడం కొత్తకాదు.. పరభాషా నటీమణులు, విదేశీ హీరోయిన్లు తెలుగుతెరపై ఎప్పుడూ కనిపిస్తూనే ఉంటారు. ఈ ఏడాది ప్రారంభం నుండి వరుసగా విడుదలైన చిత్రాలు.. రాబోయే చిత్రాలను గమనిస్తే కొత్త తారలే ఎక్కువగా కనిపిస్తున్నారు. గతేడాదిలో రష్మిక, పూజాహెగ్డే, రాశీఖన్నా, శృతిహాసన్ తదితర సీనియర్ నటీమణులు వరుసగా సినిమాలు చేశారు. ఈ ఏడాదిలో మాత్రం ఆ హవా కాస్త తగ్గింది. కొత్త తారలు వరుసగా సినిమా అవకాశాలు దక్కించుకుంటున్నారు.



సంక్రాంతి బరిలో నిలిచిన 'కల్యాణం కమనీయం' చిత్రంలో సంతోష్ శోభన్ పక్కన తెలుగు ప్రేక్షకుల్ని పరిచయమైంది కన్నడ నటి ప్రియ భవానీ శంకర్. 'బుట్టబొమ్మ' చిత్రంతో హీరోయిన్‌గా వెండితెరపై మెరిసింది అనిక సురేంద్రన్. ఆ తరువాత 'అమిగోస్' చిత్రంతో ఆషికా రంగనాథ్ తెలుగుతెరకు పరిచయమైంది.





వాణిజ్య ప్రకటనల్లో నటించి మెప్పించిన సాక్షి వైద్య 'ఏజెంట్' సినిమాతో వెండితెరకు పరిచయమయ్యారు. ఇక టైగర్ నాగేశ్వరరావు చిత్రంతో నూపుర్ సనన్, గాయత్రి భరద్వాజ్ పరిచయమవుతున్నారు. ప్రభాస్, మారుతి కాంబినేషన్‌ల్లో రాబోతున్న చిత్రంలో తమిళ నటి మాళవికా మోహనన్ తెలుగుతెరపై మెరవనున్నారు. ఎన్‌టిఆర్, కొరటాల శివ కాంబోలో రాబోతున్న చిత్రంలో బాలీవుడ్ నటి, శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్ ఇండస్ట్రీకి పరిచయమవుతున్నారు.

విజయవాడలో పుట్టి పెరిగిన డింపుల్ హయతి హైద్రాబాద్ కేంద్రంగా ఆరేళ్ల క్రితమే 'గల్ఫ్' చిత్రంతో ఇండస్ట్రీకి పరిచయమైనా గతేడాది విడుదలైన రవితేజ నటించిన 'ఖిలాడి' చిత్రం, ఈ ఏడాది రాబోతున్న గోపీచంద్ నటిస్తున్న 'రామబాణం' చిత్రాలతో వరుసగా భారీ ప్రాజెక్టుల్లో కనిపిస్తున్నారు. 'ఉప్పెన' చిత్రంతో పరిచయమైన కృతిశెట్టి కూడా ఇండస్ట్రీకి వచ్చి నాలుగేళ్లు అయ్యింది. పెద్ద బ్యానర్, మెగా కాంపౌండ్ హీరోయిన్‌గా పరిచయమవ్వడం ఆమె కెరీర్‌కు ప్లస్ అయ్యింది. వరుసగా భారీ ప్రాజెక్టుల్లో 'శ్యాం సింగరాయ్', 'బంగార్రాజు', 'ద వారియర్', 'మాచర్ల నియోజకవర్గం' 'ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి', 'కస్టడీ' చిత్రాల్లో దూసుకుపోతున్నారు.



'పెళ్లి సందడి' చిత్రంలో 2021లో కథానాయికగా తెలుగు తెరకు పరిచయమయ్యారు కన్నడ నటి శ్రీలీల. ఆ తరువాత మళ్లీ రవితేజ నటించిన 'ధమాకా' చిత్రంతో మరోసారి మెరిశారు. ఇప్పుడు ఈ నటి వరుస ఆఫర్లతో బిజీగా ఉన్నారు. చిత్రీకరణ జరుపుకుంటున్న నితిన్-32 చిత్రంలో, నవీన్ పోలిశెట్టితో 'అనగనగా ఒక రాజు', ఇంకా టైటిల్ ఖరారు కాని బోయపాటి, బాలకృష్ణ సినిమాలో, పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్', మహేష్‌బాబు తదుపరి చిత్రం 'ఎస్-ఎస్ఎంబి-28'లో వరుస ఆఫర్లు దక్కించుకున్నారు.

మలయాళ నటి సంయుక్త 'భీమ్లా నాయక్'తో తెలుగు తెరకు పరిచయమయ్యారు. తరువాత 'బింబిసార'లో నటించినా అంతగా ఫేమ్ రాలేదు. తెలుగు స్ట్రెట్ సినిమా చేసిన ధనుష్ పక్కన 'సార్' చిత్రంలో కనిపించి ఒక్కసారిగా టాక్ ఆఫ్ ద టౌన్‌గా నిలిచారు. ఇప్పుడు 'విరూపాక్ష' చిత్రంలో నటించి తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. నందమూరి కళ్యాణ్‌రామ్ చిత్రంలో 'డెవిల్'లో కూడా ఆమె నటిస్తున్నారు. నాని 'గ్యాంగ్ లీడర్' చిత్రంతో 2019లో ఇండస్ట్రీకి పరిచయమైన ప్రియాంక అరుళ్ మోహన్ శర్వానంద్‌తో రెండేళ్ల తరువాత 'శ్రీకారం' చిత్రంలో కనిపించారు. ఇప్పుడు పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఓజీ' చిత్రంలో అవాకాశం దక్కించుకున్నారు.




హైద్రాబాద్‌లో పుట్టి పెరిగిన ఫరియా అబ్దుల్లా 'జాతిరత్నాలు'తో ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. డ్యాన్సర్‌గా, నటిగా నిరూపించుకుంటూ చిత్రసీమలో తనకంటూ ప్రత్యేకస్థానాన్ని ఏర్పాటు చేసుకున్నారు. రంగస్థల నటిగా తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటూ వచ్చానని చెప్పే ఈ నటి పెయింటింగ్ వేయడం, రచనలు చేయడం, ప్రయాణాలు అంటే ఇష్టమని చెబుతారు. 'జాతిరత్నాలు' తరువాత 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' చిత్రంలో కనిపించారు. రవితేజ రావణాసురలో కూడా నటించి అభిమానులను సంపాదించుకున్నారు. ఇలా ఈ ఏడాదంతా కొత్త తారలు ఇండస్ట్రీలో వరుస అవకాశాలు పొందుతూ ప్రేక్షకులకు వినోదాన్ని పంచేందుకు సిద్ధమవుతున్నారు.



# బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలి

- రెజ్లర్లు వినేశ్, సాక్షి, బజరంగ్ డిమాండ్
- జంతర్‌మంతర్ వద్ద ఎనిమిదో రోజు రెజ్లర్ల దీక్ష




**భారత అగ్రశ్రేణి రెజ్లర్ల ఆందోళన ఎనిమిదో రోజుకు చేరుకుంది. భారతీయ జనతా పార్టీ (బిజెపి) పార్లమెంట్ సభ్యుడు, భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని జంతర్‌మంతర్ వద్ద దీక్షలో రెజ్లర్లు వినేశ్ ఫోగట్, సాక్షి మాలిక్, బజరంగ్ పూనియా డిమాండ్ చేశారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్‌భూషణ్‌ను ప్రశ్నించటం మానేసి.. బిజెపి నాయకులు బాధిత రెజ్లర్లపైనే నిందలు వేసే పనిలో నిమగ్నమయ్యారు.**

**న్యూఢిల్లీ :** విద్యుత్ సరఫరా నిలిపివేశారు, నీటి సరఫరా తీసివేశారు. సాధన చేసేందుకు అవసరమైన మ్యాట్లను తీసుకురాకుండా అడ్డుకున్నారు. బ్యారికేడ్లను అడ్డంగా నిలిపి ఉంచి.. మల్లయోధులను అసౌకర్యానికి గురి చేశారు. అయినా.. మల్లయోధులు ఏమాత్రం వెనక్కి తగ్గటం లేదు. ఓ మైనర్ సహా ఏడుగురు మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధింపులకు గురిచేసిన భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఎంపీ, భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని ఉద్యమం ఉధృతం చేశారు. న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద రెజ్లింగ్ క్రీడాకారుల ఆందోళన ఆదివారం నాటికి ఎనిమిదో రోజుకు చేరింది. సుప్రీంకోర్టు ఆదేశంతో బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినా.. ఈ కేసులో ఢిల్లీ పోలీసుల నుంచి ఎటువంటి పురోగతి లేదు. దీంతో బిజెపి ఎంపీని తక్షణమే అదుపులోకి తీసుకోవాలని రెజ్లర్లు డిమాండ్ చేస్తున్నారు.



**బిజెపి నేతలూ మద్దతు ఇవ్వచ్చు! :** భారతీయ జనతా పార్టీ (బిజెపి) నాయకులు, అధికార పార్టీ అనుకూల మీడియా రెజ్లర్ల ఆవేదన పట్టించుకోకుండా.. రెజ్లర్లకు ఎవరు మద్దతు పలికినా ఓవరాల్‌గా ఉద్యమానికే రాజకీయ రంగు పులిమే పనిలో బిజీగా ఉన్నారు. జనవరిలో రెజ్లర్లు జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేశారు. కానీ ఏ రాజకీయ నేపథ్యం ఉన్నవారికి నిరసనలో భాగం కానివ్వలేదు. దిగ్గజ బాక్సర్ విజేందర్ సింగ్ మద్దతు ఇచ్చేందుకు వచ్చినా.. సున్నితంగా తిరస్కరించారు. తాజాగా, కేంద్ర ప్రభుత్వం, కేంద్ర క్రీడాశాఖ సహా ఢిల్లీ పోలీసులు రెజ్లర్లను లైంగికంగా వేధించిన బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను కాపాడేందుకు ప్రయత్నిస్తుండటంతో మల్లయోధులు నిరసన దీక్షను మరో స్థాయికి తీసుకెళ్లారు. ఈ సారి రైతుల నుంచి మహిళల వరకు ఎవరు మద్దతిచ్చినా సాదరంగా స్వాగతిస్తున్నారు. రాజకీయ నేతల మద్దతుతో రెజ్లర్ల ఉద్యమం రాజకీయ లక్ష్యాలతో కూడుకున్నది కాబోదని.. మా లక్ష్యం బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయటమేనని రెజ్లర్లు స్పష్టం చేశారు. 'మూడు నెలల క్రితం ఇదే జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేశాం. రాజకీయ నేతలను దీక్ష వద్దకు అనుమతించలేదు. కేవలం రెజ్లింగ్ సమాఖ్య సమస్యగానే పరిగణించి పోరాడాం. కానీ ప్రభుత్వం ఎటువంటి పరిష్కారం చూపలేదు. మూడు నెలలు ముగిసినా.. ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అందుకే మళ్లీ జంతర్‌మంతర్ వద్దకు రావాల్సి వచ్చింది. బాధిత రెజ్లర్లకు అండగా నిలిచేందుకు, మద్దతు ఇచ్చేందుకు రాజకీయ పార్టీల నాయకులు వస్తున్నారు. మాకు ఎటువంటి రాజకీయ ఉద్దేశాలు లేవు. బిజెపి నాయకులు కూడా వచ్చి మాకు మద్దతు తెలపవచ్చు. వాళ్లను కూడా మేము సాదరంగా స్వాగతిస్తాం. న్యాయ పోరాటం మద్దతు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతామని' వినేశ్ ఫోగట్ పేర్కొంది.

**రాజకీయ నేతలే నడుపుతున్నారు :** మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణలపై స్పందించకుండా ఇన్నాండ్లు మౌనంగా ఉండిపోయిన బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్.. మల్లయోధులకు మద్దతుగా రాజకీయ నాయకులు రావటంతో రెజ్లర్ల ఉద్యమాన్ని నడిపిస్తున్నదే రాజకీయ నాయకులేనని బ్రిజ్‌భూషణ్ విమర్శలు గుప్పించారు. రెజ్లర్ల ఆందోళనను పక్కదోవ పట్టించేందుకు మీడియా ముందుకొచ్చి రాజకీయ నాయకుల మద్దతుపై ప్రశ్నించారు. 'ఈ పోరాటం ఇప్పుడు అథ్లెట్ల చేతుల్లో లేదు. రాజకీయ నాయకులు నడిపిస్తున్నారు. రెజ్లర్లు ఆందోళనకు దిగిన తొలి రోజు నుంచే నేను దీని వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని అనుమానించాను. అథ్లెట్ల ఆందోళనను కాంగ్రెస్ ఇతర రాజకీయ పార్టీలు వాడుకుంటున్నాయి. ఆందోళన చేస్తున్న రెజ్లర్లది రాజకీయ లక్ష్యమే కానీ నా రాజీనామా కాదు' అని బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ అన్నారు. రెజ్లింగ్ క్రీడాకారులు న్యాయం కోసం పోలీసులు, న్యాయస్థానాలను ఆశ్రయించాలి కానీ ఇలా జంతర్‌మంతర్‌లో కూర్చోవటం కాదు. ఈ విషయంలో న్యాయస్థానం ఏం తీర్పు ఇచ్చినా శిరసావహించేందుకు సిద్ధంగా ఉన్నానని బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ వ్యాఖ్యానించారు.

ఇక ఆదివారం జంతర్‌మంతర్ ఆందోళన చేస్తున్న రెజ్లింగ్ క్రీడాకారులకు రాజకీయ, ప్రజాసంఘాల నాయకుల మద్దతు వెల్లువెత్తింది. భీమ్ ఆర్మీ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆజాద్, రాబర్ట్ వాద్రా సహా తదితరులు సంఘీభావం తెలిపారు. లైంగిక వేధింపుల అంశంలో ప్రధాన మంత్రి, కేంద్ర ప్రభుత్వం, భారతీయ జనతా పార్టీ బాధిత రెజ్లర్ల పక్షాన కాకుండా, అధికార బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ పక్షాన ఉన్నారని సంఘీభావం తెలుపుతూ నేతలు ఆరోపించారు.


Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68